

నిరుద్యోగులను నిండాముంచిన

కిలేడి

- » ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో లక్షల్లో వసూలు
- » నకిలీ ఐడీ కార్డులు ఇచ్చి వల
- » నియామక ఉత్తర్వులు రాకపోవడంతో బయటపడిన మోసం
- » తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని బాధితుల వేడుకోలు
- » పోలీసుల వద్దకు చేరిన వ్యవహారం
- » ఇతర ప్రాంతాల్లోనూ బాధితులు

6



అక్షర (ఫైల్)

కాలేజికి వెళ్లమన్నందుకు...

- » పురుగులమందు తాగి ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య
- » కలవల నాగారంలో విషాదం

6



పర్యాటకం ప్రకాశించేనా!

ఉమ్మడి జిల్లాలో టూరిజం వికాసానికి అవకాశాలెన్నో..

- » పాలేరు నుంచి పర్ణశాల వరకు పర్యాటక కేంద్రాలు
- » మరుగున పడుతున్న ఖమ్మం ఖిల్లా, బౌద్ధ స్థూపం
- » ముందుకు సాగని భద్రాద్రి అభివృద్ధి ప్రణాళికలు
- » ఎకో టూరిజానికి అవకాశాలున్నా పట్టింపు కరువు
- » ప్రణాళికలే తప్ప ప్రభుత్వాల నుంచి జాడలేని నిధులు
- » పర్యాటక అభివృద్ధిపై దృష్టి సారించిన మంత్రులు
- » పలు ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యాటక ధామంగా పేరుపొందింది. గలగల పారే గోదావరి, కిన్నెరసాని వంటి నదులు, ప్రకృతి అందాలను పంచే ఎత్తైన కొండకోనలు, అడవులు.. పురాతన చారిత్రక కట్టడాలు, పుణ్యక్షేత్రాలకు ఈ ప్రాంతం నెలవు. పర్యాటక అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నా ప్రభుత్వాలనుంచి సరైన ప్రోత్సాహం మాత్రం కరువైంది. ప్రతిఏటా ప్రతిపాదనలు చేయడం, ఆ తర్వాత అనేక కారణాలతో అవి బుట్టదాఖలు కావడం పరిపాటిగా మారింది. భౌగోళికంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చేరువగా ఉంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాను అనుసంధానం చేస్తూ పలు జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతోంది. మరోవైపు కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు ప్రతిపాదన పట్టాలెక్కుతోంది. కొత్తగా మల్కన్‌గిరి, భద్రాచలం వైపు రైల్వే మార్గం కూడా రాబోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లాలో పర్యాటక అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారిస్తే ఖమ్మం పర్యాటక గుమ్మంగా వర్ధిల్లే అవకాశాలున్నాయి.

ఖమ్మం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లా నుంచి డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ముగ్గురు నేతలు ఇటీవల పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించి ఖమ్మం ఖిల్లాతోపాటు నేలకొండపల్లి బౌద్ధ స్థూపం అభివృద్ధికి ప్రతిపాదనలు చేశారు. ఇందుకోసం జిల్లా అధికారులు పూర్తిస్థాయి నివేదికలను సిద్ధం చేస్తున్నారు.

చారిత్రకంగా కాకతీయులు, నిజాం రాజులు, రెడ్డిరాజులు, ముసునూరి రాజుల పాలనకు కేంద్రంగా ఉన్న ఖమ్మం ఖిల్లాకు వెయ్యేళ్ల చరిత్ర ఉంది. క్రీ.శ 950లో ఖమ్మం మెట్టుగా దీనికి పునాదులు వేశారు. ఈ ఖిల్లా 400ఏళ్ల పాటు కాకతీయుల ఆధీనంలో ఉండగా 300 ఏళ్లపాటు రెడ్డిరాజులు కూడా పాలించారు. అనంతరం ముసునూరి నాయకులు నంద పాణి, కల్లూరు, గుడ్లూరు రాజులు స్వతంత్రంగా ఈ కోటను కేంద్రంగా చేసుకుని పాలన సాగించారు. ఆ తర్వాత ఇది కుతుబ్‌షాహీల వశమైంది. ఇంతటి చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఖమ్మం ఖిల్లా నేడు మరుగున పడి ఉంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఇటీవల పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విచ్చేసి ఖిల్లా అభివృద్ధికి ప్రణాళిక తయారు చేశారు. రోప్‌వే, ఫుడ్‌కోర్టు, లైటింగ్, అడ్వెంచర్ గేమ్స్, రహదారుల నిర్మాణం, వెయింటింగ్ (మిగతా 6వ పేజీలో)

ఉమ్మడి ఖమ్మం... పర్యాటక ధామం..

- ఖమ్మం స్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం
- పాలేరు రిజర్వాయర్, కూసుమంచి శివాలయం
- నేలకొండపల్లి బౌద్ధస్థూపం, భక్తరామదాసు నిలయం
- ఖమ్మం ఖిల్లా, లకారం ట్యాంక్‌బండ్, వెలుగుమట్ల అర్బన్ ఫారెస్టు పార్కు
- వైరా రిజర్వాయర్
- జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం
- పెనుబల్లి కనకగిరి గుట్టలు, నీలాద్రీశ్వరాలయం, బెండాలపాడు గుట్ట శివాలయం
- కొత్తగూడెం సింగరేణి గనులు, సింగరేణి మ్యూజియం, కిన్నెరసాని రిజర్వాయర్, కిన్నెరసాని జూపార్కు
- పాల్వంచ కేటీపీఎస్, నవభారత్, ఐటీసీ, బీపీఎల్
- భద్రాచలం గోదావరి నది, సీతారామచంద్రస్వామి దేవాలయం, పర్ణశాల
- మోతెగడ్డ వీరభద్రస్వామి ఆలయం
- అశ్వాపురం భారజల కర్మాగారం
- భద్రాద్రి పవర్‌ప్లాంట్, సీతమ్మసాగర్ బ్యారేజీ
- దుమ్ముగూడెం బ్రిటీష్‌కాలం నాటి ఆనకట్ట

నేడు లకారం వద్ద సాంస్కృతిక సందడి

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబర్ 26: ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని లకారం టాంక్ బండ్ వద్ద శుక్రవారం సాయంత్రం 7 గంటల నుండి 9 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి బి. సుమన్ చక్రవర్తి తెలిపారు. ప్రపంచ పర్యాటక సంస్థ ఈ సంవత్సరం "పర్యాటకం-శాంతి" అనే అంశంతో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా యోచిస్తుందనీ, దీనిలో భాగంగా జిల్లా పర్యాటక శాఖ, ఖమ్మం ఆధ్వర్యంలో లకారం టాంక్ బండ్ వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే పర్యాటక ప్రదేశ ప్రచార నిమిత్తం పులిగుండాల గుట్టలకు (కనకగిరి గుట్టలకు) పాఠశాల విద్యార్థినులకు శనివారం నాడు టూర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఖమ్మం ఖిల్లాపై త్వరలో రోప్‌వే

- » పాలేరు, వైరా రిజర్వాయర్లలో బోటింగ్
- » పర్యాటక అభివృద్ధి సమీక్షలో తుమ్మల

6

చివరి ఆయకట్టు వరకూ

సాగర్ జలాలు

- » రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- » ఎడమ కాలువపై నిరంతర పర్యవేక్షణ : కలెక్టర్
- » కల్లూరు డివిజన్‌కు చేరిన జలాలు.. రైతుల్లో ఆనందం...



సాగర్ ప్రధానకాల్వపై 72 కి.మీ. రెగ్యులేటరీ వద్ద నీటి సరఫరాను పరిశీలిస్తున్న అధికారులు

కూసుమంచి/కల్లూరు, సెప్టెంబరు 26: సాగర్ ఎడమకాలువ పరిధిలో చివరి ఆయకట్టు వరకు సాగర్ జలాలు అందిస్తామని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. గురువారం కూసుమంచి మండలం పాలేరు జలాశయం ఎడమ కాలువ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఇటీవల కాలువ మరమ్మతుల్లో భాగంగా యూటీ నిర్మాణం లేకుండానే కాలువను పునరుద్ధరించగా, పాలేరు పరిసరాలకు చెందిన వరదనీరు పొలాల్లో నిలిచిపోతోంది. జిల్లా మంత్రుల ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు 100 హెచ్‌పీ సామర్థ్యం గల 11 మోటార్ల సాయంతో 200 క్యూసెక్కుల నీటిని కాల్వలో ఎత్తిపోసే ప్రక్రియను కలెక్టర్ గురువారం సాయంత్రం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నీరు ఎలా వస్తుందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాలేరు నుంచి జుజ్జులరావుపేట వైపు కట్ట చివరి వరకు నడిచి కట్ట పటిష్టతను పరిశీలించారు. ఈ సందర్భంగా యూటీ తొలగించిన ప్రాంతంలో వచ్చే ఊట నీటిని (మిగతా 6వ పేజీలో)



ఖమ్మంలో ఐలమ్మకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

- » నవ సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలి
- » నివాళులర్పించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- » ఘనంగా జయంతి వేడుకలు.. పాల్గొన్న బీసీ సంఘాల నేతలు

6

టోల్ పేరుతో ఆర్టీసీ చార్జీల పెంపు

- » రూ.10 నుంచి రూ.20 వరకు అదనంగా వడ్డన
- » నేలకొండపల్లి మండలం పైనంపల్లి వద్ద టోల్‌ప్లాజా ప్రారంభ ఎఫెక్ట్
- » నిరసన వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



నేలకొండపల్లి/ఖమ్మం ఖానాపురం హవేలి, సెప్టెంబరు 26: టోల్‌ఛార్జీల పేరుతో ఆర్టీసీ చార్జీలు పెంచేసింది. ముందస్తుగా ఎలాంటి ప్రకటన లేకుండా ఆకస్మికంగా చార్జీలు పెంచడంపై ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే... 365ఏ జాతీయ రహదారిపై నేలకొండపల్లి మండలం పైనంపల్లి వద్ద రెండురోజుల క్రితం టోల్‌ప్లాజాను ప్రారంభించారు. దీంతో ఆర్టీసీ చార్జీలను ఒక్కసారిగా పెంచింది. టోల్‌ప్లాజా ప్రారంభం కాక ముందు నేలకొండపల్లి నుంచి కోదాడకు ఆర్డినరీ ఛార్జి రూ.20 ఉండగా ప్రస్తుతం రూ.40, ఎక్స్‌ప్రెస్ ఛార్జి రూ.30కు బదులుగా రూ.50 వసూలు చేస్తున్నారు. కోదాడ నుంచి ఖమ్మం ఆర్డినరీ రూ.గతంలో రూ.50 ఉండగా, ప్రస్తుతం రూ.70 తీసుకుంటున్నారు. ఖమ్మం నుంచి నేలకొండపల్లి ఆర్డినరీ చార్జీ గతంలో రూ.30 ఉండగా, ఇప్పుడు రూ.40 వసూలు చేస్తున్నారు. టోల్‌ప్లాజా పేరుతో నేలకొండపల్లి టూ కోదాడ, నేలకొండపల్లి టూ ఖమ్మం చార్జీని ఒక్కసారిగా రూ.20, రూ.10 పెంచటం పట్ల ప్రయాణీకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. టోల్ చార్జీల పేరుతో ఒక్కసారిగా వడ్డించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. చార్జీలు తగ్గించకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

ఇదిలావుండగా, ఖమ్మం నుంచి సూర్యాపేటకు గతంలో రూ.70 ఉన్న చార్జీ ప్రస్తుతం రూ. 80కు పెరిగింది. దీనిపై ఆర్టీసీ అధికారులు వివరణ ఇచ్చారు. బస్సులు గతంలో ఖమ్మం పాత బస్టాండ్ నుంచి కాల్వొడ్డు ప్రాంతం మీదుగా సూర్యాపేట వెళ్లేవని, అయితే పాత బ్రిడ్జి వద్ద తీగల వంతెన మూలంగా ప్రస్తుతం పాత బస్టాండ్ నుంచి జడ్పీ సెంటర్, ఇల్లెందు క్రాస్ రోడ్, ఎన్‌టీఆర్ బైపాస్ మీదుగా కాల్వొడ్డుకు, అక్కడి నుంచి సూర్యాపేటకు వెళ్లుతున్నాయని తెలిపారు. దీంతో 5 కి.మీ. దూరం పెరిగిందని అందుకే అదనంగా రూ.10 వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు.



ధాన్యం దందా @ 81కోట్లు

- » ఎస్‌ఏఆర్ రైస్ మిల్లు యాజమానిపై కేసు

కొణిజర్ల, సెప్టెంబరు 26: సీఎంఆర్ రైస్‌కు సంబంధించి ప్రభుత్వానికి సరఫరా చేయకుండా ధాన్యాన్ని పక్కదారి పట్టించినందుకు కొణిజర్ల మండలం లాలాపురం సమీపంలోని ఎస్‌ఏఆర్ రైస్ ప్రొడక్ట్స్ మిల్లు యాజమానిపై కేసు నమోదైంది. పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ గంటా శ్రీలత ఫిర్యాదు మేరకు గురువారం మిల్లు యాజమాని రమాజ్యోతిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సూరజ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్‌ఏఆర్ రైస్ ప్రొడక్ట్స్ మిల్లుకు ప్రభుత్వం 2022-23, 2023-24 రబీ, ఖరీఫ్ సీజన్‌లకుగాను 3,50,622 క్వింటాళ్ల ధాన్యాన్ని సరఫరా చేయగా, మిల్లువారు 99,122.68 క్వింటాళ్లు మాత్రమే మర ఆడించి ప్రభుత్వానికి పంపించారు. మిగిలిన 2,51,499 క్వింటాళ్ల ధాన్యాన్ని పక్కదారి పట్టించారు. దాంతో టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయీస్ అధికారులు తనిఖీలు నిర్వహించి 25,149మెట్రిక్ టన్నులు తేడాఉన్నట్లు తేల్చారు. దీని విలువ సుమారు రూ.81కోట్ల 60లక్షలు ఉంటుందని మిల్లు యాజమానిపై సవిల్‌సప్లయీస్ డీఎం శ్రీలత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రైస్‌మిల్లుపై విజిలెన్స్ దాడి

- » ధాన్యం కొనుగోలు డబ్బుల రికవరీయే లక్ష్యం
- » క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక
- » పెనుబల్లి మండలంలో సంచలనం


6

'సీజన్'లోనే హడావిడి

- » నెలవారీ తనిఖీలు ఏవీ..?
- » రైస్ మిల్లర్ల అక్రమాలపై చిత్తశుద్ధి కరువైన అధికారులు

సీతాఫలాల సందడి షురూ...

- » భగ్గుమంటున్న ధరలు
- » కిలో రూ.150 నుంచి రూ.200



ఖమ్మం సాంస్కృతికం, సెప్టెంబరు 26: సీజనల్ పండ్లు సీతాఫలాలు నోరూరిస్తున్నాయి.. ఏటా అక్టోబరు, నవంబరు మాసాలలో అందుబాటులోకి వచ్చే సీతాఫలాలు.. ఈ ఏడాది ఒక నెల ముందుగానే లభ్యం అవుతున్నాయి. సీతాఫలాలు.. తియ్యని రుచితోపాటు పోషకాల పరంగా ఆరోగ్యానికి మేలు చేస్తాయి. చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అన్ని వయస్సుల వారిని ఈ ఫలాలు ఆకట్టుకుంటాయి. పరిసర అటవీ ప్రాంత జిల్లాల నుంచి ఈ ఫలాలను తీసుకు వచ్చి వ్యాపారులు ఖమ్మం నగరంలో రోడ్లవెంట, బండ్లమీద విక్రయిస్తున్నారు. నాటు రకాల పండ్లు కనుక వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నా.. ధరలు మాత్రం సామాన్యులకు అందుబాటులో ఉండకపోవటం నిరాశ పరుస్తోంది. గతంలో సీతాఫలాలను డజన్ల చొప్పున విక్రయించే వారు. అన్ని వర్గాల వారికి ధరలు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం వీటిని కిలోల చొప్పున విక్రయిస్తున్నారు. కిలో సీతాఫలాలు పండ్ల నాణ్యత, సైజులను బట్టి రూ.150 నుంచి రూ. 200 వరకు ఉండటంతో పేద, మధ్య తరగతి వర్గాల వారు కొనుగోలు చేయలేకపోతున్నారు. అడవులు, తదితర బంజరు భూములు తగ్గిపోవటంతో సీతాఫలాల చెట్లు తగ్గి సహజ లభ్యత లోపించింది. ఇతర ప్రాంతాల్లో కొందరు తోటలను సాగుచేస్తూ కాయలను ఉత్పత్తి చేస్తుండటంతో పూర్తి వాణిజ్య ఫలాలుగా మారిపోయాయి.

కుల నిర్మూలనకు
ప్రజలు ఐక్యం కావాలి

సత్యశోధక్ కార్యక్రమంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి



మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 26: ఆధునిక కాలంలోనూ కులాల పేరుతో వివక్షలు కొనసాగటం హేయమని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి, సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా నాయకులు కే శ్రీనివాస్ పేర్కొన్నారు. మాస్‌లైన్ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే స్థాపించిన సత్యశోధక్ సంస్థ 139వ సంవత్సరంగా మాస్‌లైన్ ఆధ్వర్యంలో గురువారం బల్లేపల్లిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బడుగు, బలహీనవర్గాలను చైతన్య పరచడానికి సత్యశోధక్ సంస్థను జ్యోతిరావుపూలే స్థాపించారని చరిత్రను వివరించారు. బడుగు, బలహీనవర్గాలకు భూమిపై హక్కు ఉండి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరగటంతో కుల, మతాల అంతరాలు తగ్గుతాయని, అంతరాలు తొలగించేందుకు ప్రజలంతా ఐక్యంగా కదిలిరావాలన్నారు. సెప్టెంబరు 24 నుంచి 30 వరకు గ్రామ గ్రామాన అవగాహన సదస్సులు, సభలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నాయకులు జే లెనిన్, కొమరయ్య, ధరణ్, కృష్ణ, ములకలపల్లి లక్ష్మీనారాయణ, నాగన్న, బొమ్మ కంటి రమేశ్, ఐతనబోయిన వెంకన్న పాల్గొన్నారు.

దశ.. దిశ ఏదీ!

- లోక్‌సభ ఎన్నికలు ముగిసి ఐదు నెలలు
- ఇంకా సమావేశంకాని జిల్లా అభివృద్ధి సమన్వయ(దిశ) కమిటీ
- కేంద్ర పథకాలపై సమీక్ష కరువు



ఖమ్మం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా.. జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ(దిశ) కమిటీ సమావేశాలు ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. కొత్తగా ఎన్నికైన లోక్‌సభ సభ్యులు ఈ కమిటీ సమావేశాలకు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఖమ్మం జిల్లా దిశ కమిటీ సమావేశానికి ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, భద్రాద్రికొత్తగూడెం జిల్లా దిశ కమిటీ సమావేశానికి మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్‌లు చైర్మన్లుగా ఈ సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. పార్లమెంట్ సభ్యుల సిఫారసుతో కొంతమంది దిశ కమిటీలో సభ్యులుగా నియమితులవుతారు. వీరితోపాటు జిల్లాకు చెందిన రాజ్యసభ, శాసనసభ, శాసన మండలి సభ్యులు, స్థానికసంస్థల నుంచి మునిసిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, దిశ కమిటీలో సభ్యులుగా ఉంటారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీల నుంచి కూడా కొందరు ప్రతినిధులు ఈ కమిటీకి నామినేట్ అవుతారు.

జిల్లాలో కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును పర్యవేక్షించి సమీక్షించేందుకే ఈ దిశ కమిటీ సమావేశాలు నిర్వహిస్తారు. వాస్తవానికి కనీసం ఆరునెలలకు ఒకసారైనా దిశ కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. కుదిరితే మూడు నెలలకే సమావేశాలు నిర్వహించుకోవచ్చు. ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై కేంద్ర ప్రభుత్వ సంస్థల అధికారులతోపాటు జిల్లా అధికారులతోనూ ప్రజాప్రతినిధులు సమీక్షించి క్షేత్రస్థాయిలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పర్యవేక్షిస్తారు. కేంద్రం నుంచి రావాల్సిన బడ్జెట్‌లో సంక్షేమపథకాల గురించి చైర్మన్ హోదాలో ఎంపీలు తెలుసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నుంచి 43పైగా శాఖల ద్వారా పలు పథకాలు అమలవుతున్నాయి.

సమావేశాలు జరిగితేనే పథకాల అమలు..

దిశ కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా జరిగితేనే క్షేత్రస్థాయిలో కేంద్ర ప్రభుత్వ పథకాలకు నిధులు వస్తున్నాయా లేదా వచ్చిన నిధులు సద్వినియోగం అవుతున్నాయా లేదా చర్చించే అవకాశం ఉంది. దిశ కమిటీ సమావేశాల్లో లోక్‌సభ సభ్యులు చైర్మన్‌గా రాజ్యసభ సభ్యులు కో-చైర్మన్లుగా, జిల్లా కలెక్టర్లు కో-ఆర్డినేటర్లుగా వ్యవహరిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, పనుల తీరుపై ఈ సమావేశాల్లో చర్చించడం ద్వారా కేంద్ర నుంచి రావాల్సిన నిధులు, పనులు, పథకాల గురించి ఎంపీలు చర్చించి, అందుకు సంబంధించి ప్రతిపాదనలను జిల్లా అధికారుల నుంచి కేంద్రంలోని ఆయా శాఖలకు పంపించి నిధులు, పనుల మంజూరుకు చొరవ తీసుకునే అవకాశం ఉంటుంది. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖలు దిశ కమిటీ సమావేశాల్లో కీలకపాత్ర పోషిస్తాయి. ఖమ్మం దిశ కమిటీ సమవేశం గురించి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్యను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఖమ్మం దిశ కమిటీ సమావేశం ఇంకా నిర్ణయించలేదని త్వరలోనే నిర్ణయించి ప్రకటిస్తామని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ఇలా..

కేంద్ర ప్రభుత్వ శాఖల ద్వారా అమలు చేసే పథకాల్లో ప్రధానంగా నేషనల్‌హైవే అథారిటీ ఆఫ్ ఇండియా జాతీయ రహదారులు, మౌలిక వసతుల కల్పనతోపాటు ప్రధానమంత్రి గ్రామ సడక్‌యోజన (పీఎంజీఎస్‌వై), జిల్లా గ్రామీణ మంచినీటి సరఫరా, పారిశుధ్యం(ఎన్‌ఆర్‌డీడబ్ల్యూపీ), ప్రధానమంత్రి కృషి సించయా యోజన(పీఎంకేఎస్‌వై), యాక్సిలిరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్ ప్రోగ్రాం(ఏఐబీపీ), కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అండ్ వాటర్ మేనేజ్‌మెంట్(సీఏడీడబ్ల్యుఎంపీ), దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన(డీడీయుజీజేవై), ఇంటిగ్రేటెడ్ పవర్ డెవలప్‌మెంట్ స్కీం (ఐపీడీఎస్), స్వచ్ఛభారత్ మిషన్(ఎస్‌బీఎం), అటల్‌మిషన్ రెజునేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్(ఏఎంఆర్‌యూటీ), నేషనల్ హెరిటేజ్ సిటీ డెవలప్‌మెంట్ అండ్ అగ్మెంటేషన్ యోజన(హెచ్‌ఆర్‌యూడీఏవై), స్మార్ట్ సిటీ మిషన్ (ఎస్‌సీఎం), ప్రధానమంతి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం(పీఎంఈజీపీ), మౌలిక వసతుల కల్పన రైల్వేస్, మహత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ స్కీం(ఎంఆర్‌ఈజీఎస్), జాతీయ సామాజిక భద్రతా పథకం(ఎన్ఎస్ఏపీ), దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన(డీడీయూజీకేవై), స్వచ్ఛభారత్ మిషన్, జిల్లా మహిళ, శిశు సంక్షేమశాఖ(ఐసీడీఎస్), సుగమ్య భారత్ అభియాన్, భేటీబచావో భేటీ పడావో, ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన, రాష్ట్రీయ కృషి వికాసయోజన, భూసార ఆరోగ్య కార్డుల పథకం, సర్వశిక్షా అభియాన్, మధ్యాహ్నభోజన పథకం, నేషనల్ హెల్త్ మిషన్, డిజిటల్ ఇండియా, ఇంటర్‌నెట్ కేంద్రాలు, మౌలిక వసతుల కల్పన, ప్రధానమంత్రి ఖనిజ క్షేత్ర కల్యాణ యోజన, ప్రధానమంత్రి కౌశల్ వికాస్‌యోజన, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామయోజన, నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్, ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్‌యోజన, డిజిటల్ ఇండియా భూమి రికార్డుల కంప్యూటరీకరణ, తపాలశాఖ తదితర శాఖల పథకాలు అమలవుతున్నాయి. ఈ పథకాలకు సంబంధించిన నిధులు, పనులపై దిశ కమిటీ సమావేశంలో చర్చిస్తారు.

కాలేజీకి వెళ్లమన్నందుకు..

»పురుగులమందు తాగి ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య » కలవలనాగారంలో విషాదం

కరకగూడెం, సెప్టెంబరు 26: కాలేజీకి వెళ్లాలని తల్లితండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురైన ఇంటర్ విద్యార్థికి ఆత్మహ్యకు పాల్పడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలంలో గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కలవలనాగారం గ్రామానికి చెందిన కలం రామయ్య, సావిత్రిలకు పిల్లలు లేకపోవడంతో 17 సంవత్సరాల క్రితం ఒక పాపను తెచ్చుకొని ఆమెకు అక్షర(17) అని పేరుపెట్టి అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. ప్రస్తుతం అక్షర భద్రాచలంలోని ఏపీఆర్ కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతుంది. అయితే హాస్టల్‌లో ఉంటూ కాలేజీకి వెళుతున్న బాలిక నెలరోజుల క్రితం ఇంటికి వచ్చింది. పదిరోజుల తరువాత మళ్లీ కాలేజీకి వెళ్లాలని తల్లిదండ్రులు సూచించడంతో ఆమె నిరాకరించింది. కాలేజీకి వెళ్లాలని గట్టిగా మందలించడంతో మనస్థాపానికి గురైన అక్షర క్షణికావేశంలో పురుగుల మందు తాగింది. గమనించిన తల్లితండ్రులు వెంటనే కరకగూడెం వైద్యశాలకు తరలించి అక్కడి నుంచి మణుగూరు, భద్రాచలం తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా మారడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. 20రోజులుగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి అక్షర మృతి చెందింది. అల్లారుమందుగా పెంచుకున్న కూతురు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. మృతురాలి తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కరకగూడెం ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

ఖమ్మం ఖిల్లాపై త్వరలో రోప్‌వే

ఖమ్మం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్రంలో ఖమ్మంజిల్లాను పర్యాటకరంగానికి గుమ్మంగా తీర్చిదిద్దడం జరుగుతుందని అందులో భాగంగా ఖమ్మంఖిల్లాకు పూర్వవైభవం తీసుకురాబోతున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం హైదరబాదులోని సెక్రటేరియట్‌లో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఎండీ ప్రకాష్‌రెడ్డి తదితరులతో మంత్రి తుమ్మల సమావేశమై జిల్లా పర్యాటక రంగం అభివృద్ధిపై సమీక్షించారు. ఖమ్మంఖిల్లా రోప్‌వే నిర్మాణ పనులు శరవేంగా చేపట్టాలని, రోప్‌వేబ్రిడ్జి లోయర్‌పాయింట్ దగ్గర పార్కింగ్ కోసం యంత్రాల తరలింపుకోసం స్థలం విశాలంగా ఉండేలా చూడాలని, లోయర్‌పాయింట్ నిర్మాణానికి లకారం చెరువు పరిసర ప్రాంతం అనువుగా ఉంటుందని ఈప్రపతిదనాలు సిద్ధంచేయాలన్నారు. రోప్‌వేతోపాటు అమ్యూస్‌మెంట్ పార్కులు, హోటళ్ల నిర్మాణాలు, వాటర్‌ఫాల్స్ కూడా చేపట్టాలన్నారు. దక్షిణ అయోధ్యగా భద్రాద్రిలోఒ ఆధ్యాత్మికశోభ పెరిగేలా చర్యలు తీసుకోవాలని కిన్నెరసాని ప్రాజెక్టు, అభివృద్ధికి, వసతుల కల్పనకు కృషిచేయాలని కోరారు.ఖమ్మంజిల్లాలో టెంపుల్‌టూరిజం , ఏకోటూరింజ, వైజ్ఞానికయాత్రలకు శ్రీకారం చుడతామని,నేలకొండపల్లి బౌద్ధస్థూపం,, భకతరామదాసు ధ్యానమందిరం , కూసుమంచి శివాలయం టూరిజం సర్యూట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని వివరించారు. టూరిజం కార్పొరేషన్ ఎండీ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ రోప్‌వే పనులకు సంబంధిత ప్రణాళిక సిద్ధంచేశామని, ఈనిర్మాణానికి ప్రముఖ కంపెనీలను సంప్రదించడం జరుగుతుందన్నారు.

పర్యాటకం ప్రకాశించేనా ?

(5వ పేజీ తరువాయి)

పార్కింగ్ ప్లేస్, మిని థియేటర్ ఏర్పాటు వంటి పనులతో ప్రతిపాదనలు చేశారు. మొత్తం రూ.29.55కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేయగా ఈ మేరకు నిధులు కేటాయించాల్సి ఉంది.

రూ.5.82కోట్లతో బౌద్ధస్థూపం అభివృద్ధి

నేలకొండపల్లిలో ఎంతో చారిత్రక ప్రాధాన్యం కలిగిన బౌద్ధస్థూపం ఉంది. ఇక్ష్వాకులు, విష్ణుకుండినుల కాలంలో నిర్మించిన ఈ బౌద్ధస్థూపం మన చరిత్ర, సంస్కృతికి సాక్షిగా నిలిచి ఉంది. ఎంతో చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ బౌద్ధస్థూపం వద్దకు అనేక మంది బౌద్ధ భిక్షువులు వచ్చి నెలల పాటు ధ్యానం చేసిన సందర్భాలున్నాయి. పురావస్తు తవ్వకాల్లో నేలకొండపల్లి బౌద్ధస్థూపం విశిష్టతతో పాటు పంచలోహ విగ్రహాలు కూడా బయటపడ్డాయి. అ స్థూలపం అభివృద్ధికి జిల్లా అధికారులు రూ .5.82కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ స్థూపం పక్కనే ఉన్న చెరువులో బోటింగ్ సదుపాయం కలిపించనున్నారు. బౌద్ధుల చరిత్రను చాటిచెప్పేలా ధ్యానమందిరాలు, ఆధ్యాత్మిక బోధనలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దీని అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. అలాగే పాలేరు రిజర్వాయర్ వద్ద రూ.4.15కోట్లతో పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు.

కనకగిరి గుట్టల్లో ఎకోటూరిజం

పెనుబల్లి, ఏన్కూరు, తల్లాడ, చంద్రుగొండ మండలాల్లో విస్తరించి ఉన్న కనకగిరి గుట్టల్లో అటవీశాఖ ఏకో టూరిజం అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేసింది. ఇక్కడ పులిగుండాల చెరువులో బోటింగ్‌తో పాటు శివాలయం అభివృద్ధి, ఇక్కడి ఆహ్లాదకరమైన గుట్టల్లో కిలోమీటరుపైగా రోప్‌వే నిర్మాణం, ఫారెస్టు సఫారీ, రాత్రిబసకు కాటేజీల నిర్మాణం వంటి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రభుత్వం నిధులు కేటాయిస్తే అటవీశాఖ పనులు ప్రారంభించనుంది. అలాగే ఖమ్మం నగర సమీపంలోని వెలుగుమట్లలో 400 ఎకరాల్లో విస్తరించిన ఫారెస్టు పార్కులో ఫుడ్ కోర్టు, ఫారెస్టు హౌజెస్, అటవీ మొక్కలు, అడవుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించే దృశ్యాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. పాల్వంచంలోని కిన్నెరసాని అభయారణ్యం అభివృద్ధి, రిజర్వాయర్‌లో బోటింగ్, వాటర్ గేమ్స్‌ను అభివృద్ధికి ప్రతిపాదనలు చేశారు.

టెంపుల్ టూరిజం

జిల్లాలో కూసుమంచి పురాతన శివాలయంతో పాటు ఖమ్మంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, జమలాపురం వెంకటేశ్వరస్వామి ఆలయం, భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయం మరికొన్ని పురాతన శివాలయాలు, ఇతర పుణ్యక్షేత్రాలను కలిపి టెంపుల్ టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. భద్రాచల పుణ్యక్షేత్ర అభివృద్ధికి కేంద్ర,, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు కేటాయించనున్నారు. భద్రాచలం వచ్చే భక్తులు పర్ణశాలకు వెళ్లేందుకు రావాణ సౌకర్యాలు మెరుగు పరచడంతో పాటు పర్ణశాలలో భక్తులకు అవసరమైన సదుపాయాల కల్పన, అక్కడ గోదావరిలో బోటింగ్ వంటి సదుపాయాల కల్పనకు ప్రణాళిక రూపొందించారు.

ఇండస్ర్టియల్ టూరిజం

జిల్లాలో సింగరేణి, ఐటీసీ, బీపీఎల్, హెవీవాటర్ ప్రాజెక్టు, కేటీపీఎస్, నవభారత్ తదితర పరిశ్రమల పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు కూడా భద్రాచలం వచ్చి వెళ్లే పర్యాటకులకు, భక్తులకు ఆయా పరిశ్రమలను సందర్శించేందుకు ఇండస్ట్రియల్ టూరిజం అభివృద్ధికి ప్రణాళిక రపొందించనున్నారు.

నిరుద్యోగులను నిండాముంచిన కి‘లేడి’

- ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో లక్షల్లో వసూలు
- నకిలీ ఐడీ కార్డులు ఇచ్చి వల

ఖమ్మం క్రైం, సెప్టెంబరు 26: ప్రభుత్వ ఉద్యోగాల ఎరవేసి, లక్షలు వసూలు చేసి, నకిలీ ఉత్తర్వులు అంటగట్టి నిరుద్యోగులను నిండా ముంచిన ఇద్దరు వ్యక్తుల ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. మోసపోయిన నిరుద్యోగులు తమ డబ్బులు తమకు ఇప్పించాలని పోలీసులను వేడుకుంటున్నారు. మోసానికి పాల్పడిన ఇద్దరిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఒక మహిళ, ఖమ్మం పాండురంగాపురానికి చెందిన వ్యక్తి ఉన్నారు. ఖమ్మం జిల్లా నుంచే కాకుండా, ఇతర జిల్లాల్లో కూడా పలువురు నిరుద్యోగులు వీరి బారిన పడినట్టు తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్లితే...

‘ఉన్నతాధికారులతో మాకు బాగా పరిచయాలున్నాయి.. ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగమైనా ఇప్పిస్తాం.. కావాలంటే భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం వద్దకు వచ్చి చూడండి.. మేమేంటో తెలుస్తోంది’ అని వారు బిల్డప్ ఇచ్చారు. వారి మాటలు నమ్మి ఉద్యోగాలపై ఆశతో అడిగినంత ముట్టచెప్పారు. కానీ ఏళ్లు గడుస్తున్నా.. ఉద్యోగాలు చేతికిరావడంతో మోసపోయామని గుర్తించి లబోదిబోమంటున్నారు. ఈ ఘరానా మోసం ఖమ్మం నగరంలో వెలుగులోకి వచ్చింది.

ఖమ్మం నగరంలోని పాండురంగాపురానికి చెందిన ముగ్గురు యువకులకు నాలుగేళ్ల క్రితం తమ ప్రాంతానికే చెందిన వ్యక్తితో పరిచయం ఏర్పడింది. సదరు వ్యక్తి భద్రాచలం ఐటీడీఏలో తనకు తెలిసిన మహిళా అధికారి ఉన్నారని, ఆమె ద్వారా ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. ఓ రోజు ఐటీడీఏ కార్యాలయం వద్దకు వారిని తీసుకువెళ్లగా, లోపలి నుంచి ఓ మహిళ బయటకు వచ్చి, తాను అధికారినని చెప్పుకుంది. యువకుల సర్టిఫికెట్ల ప్రతులు తీసుకువెళ్లి పచ్చ ఇంక్‌తో సర్టిపై చేసి సంతకం పెట్టి ఇచ్చింది. త్వరలో నియామక ఉత్తర్వులు వస్తాయని తెలిపింది. వారి మాటలను ముగ్గురు యువకులు నిజమేనని నమ్మారు. తమకు ప్రభుత్వ ఉద్యోగాలు రావడం ఖాయమని సంతోషపడ్డారు. అప్పులు తెచ్చి మరీ విడతల వారీగా ఒక్కొక్కరు రూ.3లక్షలకు పైగా చెల్లించారు. అనంతరం సదరు ఇద్దరు వ్యక్తులు కొద్దిరోజుల తరువాత ఐడీ కార్డులు ఇచ్చారు.

అయితే నెలలు గడుస్తున్నా.. అపాయింట్‌మెంట్ ఉత్తర్వులు రాకపోవడంతో ముగ్గురు యువకులు వారిని నిలదీశారు. దీంతో వెంటనే మీకు ఉద్యోగాలు వచ్చాయి. ఒకరికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇరిగేషన్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా, మరొకరికి వేంసూరు తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చిందని చెప్పారు. మరొకరికి త్వరలో ఆర్డర్ వస్తుందని చెప్పారు. ‘ఆర్డర్ కాపీలు ఐటీడీఏ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాయి.. రెండు రోజుల సెలవులు ఉన్నాయి పోస్టుద్వారా వస్తాయి..’ అని మళ్లీ నమ్మించారు. అయినా రాకపోవడంతో మళ్లీ వారిని నిలదీయగా రెండు రోజుల తరువాత వారికి ఉద్యోగాలు వచ్చినట్టు శుభాకాంక్షలు చెబుతూ ట్రెజరరీ కోడ్, ఉన్నతాధికారుల సంతకాలతో ఐడీ కార్డులు అందించారు. ఇదే సమయంలో పోలీస్ వెరిఫికేషన్ జరగకుండా ఉండేందుకంటూ రూ.20వేల చొప్పున, అలాగే ఐడీ కార్డులు ఇచ్చిన సిబ్బందికంటూ రూ.5 వేల చొప్పున వసూలు చేశారు. అయితే కార్డులలో ఎంప్లాయిమెంట్ కోడ్ నెంబర్లు లేకపోవడంతో అనుమానం వచ్చి నిలదీయగా.. ప్లేటు ఫిరాయించారు. మీ డబ్బులు మీకు ఇస్తామని గడువులు పెట్టుకుంటూ వస్తున్నారు. నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడంతో వారంతా పోలీసు అధికారులను కలిసేందుకు సిద్ధమయ్యారు.

కాంట్రాక్ట్ ఉద్యోగం మానేసిన యువకుడు

ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని ఓ యువకుడు తాను అప్పటికే చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగం కూడా మానేశాడు. బాధితులలో ఒకరైన యువకుడు కాంట్రాక్ట్ పద్ధతిలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాడు. ఇద్దరు వ్యక్తుల మాయలో పడిన యువకుడు ఐడీ కార్డు రావడంతో ఉద్యోగం వచ్చిందని, పర్మినెంట్ ఉద్యోగం అనుకుని కాంట్రాక్టు ఉద్యోగం మానేశాడు. చివరకు తాను మోసపోయానని తేలడంతో న గరంలోని ఓ వస్త్ర దుకాణంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు.

బాధితులు ఎందరో..

ఇద్దరు మోసగాళ్ల బారిన అనేకమంది నిరుద్యోగుల పడినట్టు తెలుస్తోంది. సదరు మహిళ ఓ ఎన్‌జీవో సంస్థలో పని చేస్తున్నట్టు తెలిసింది. ఆ ఎన్‌జీవో ఐడీ కార్డు చూపుతూ పలువురిని మోసం చేసినట్టు సమాచారం. ఆమె బాధితులు ఖమ్మం నగరంతోపాటు ఖమ్మం రూరల్ మండలం, ముదిగొండ మండలాల్లో కూడా ఉన్నట్టు సమాచారం. నిజామాబాద్ జిల్లాలో కూడా ఆమె పలువురిని మోసంచేసి డబ్బులు తీసుకున్నదని, గతంలో పలు కేసులు కూడా అయినట్టు బాధితులు అంటున్నారు. కాగా, ఈ మోసం ఉదంతాన్ని బాధితులు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

చివరి ఆయకట్టు వరకూ సాగర్ జలాలు

(5వ పేజీ తరువాయి)

తొలగించిన ప్రాంతంలో వచ్చే ఊట నీటిని నిరంతరం తరలించాలని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో సాగర్ ఎడమ కాలువ రెండోజోన్ ఆయకట్టు చివరి భూముల వరకు సాగర్ జలాలు అందిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం పాలేరు జలాశయం నుంచి 3వేల క్యూసెక్కుల వరకు నీటిని అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం 10.9 అడుగుల మేర నీటి ప్రవాహం అవుతుందన్నారు. క్రమంగా నీటివిడుదల పెంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఐబీ ఈఈ అనన్య, డిఈ మధు, కూసుమంచి తహసీల్దార్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు డివిజన్ చేరిన సాగర్ జలాలు

పాలేరు నుంచి దిగువకు విడుదల చేసిన సాగర్ జలాలు గురువారం నాటికి కల్లూరు డివిజన్‌కు చేరాయి. క్షేత్ర స్థాయిలో సాగర్ ప్రధాన కాలువపై 72 కి.మీ. కప్పలబంధం రెగ్యూలేటర్స్ వద్ద ఈఈ లక్ష్మీనారాయణ, డీఈలు జడ్ రత్నాకర్, వెంకటేశ్వరరావు సాగునీటి సరఫరాను తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సాగర్ కాలువ ఎగువ నుంచి కల్లూరు డివిజన్‌కు 800 క్యూసెక్కుల వరకు సాగర్ నీళ్లు అందుతున్నాయని చెప్పారు. మధిర బ్రాంచి కాలువకు 600 క్యూసెక్కులు, ప్రధానకాలువకు మరో 200 క్యూసెక్కులు సరఫరా చేయటం జరుగుతుందన్నారు. కాగా మధిర బ్రాంచి కాలువపైన 0 నుంచి 24 కి.మీ. చివర వరకు నీరు చేరటం జరిగిందని వివరించారు. సాగునీరు సక్రమంగా సరఫరా జరిగేలా అధికారులను, లస్కర్లను, సిబ్బందిని అప్రమత్తం చేయటం జరిగిందన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో ఈఎన్‌టీ సర్జరీ సేవలు

ఇల్లెందు టౌన్, సెప్టెంబరు 26: ఇల్లెందు పట్టణంలోని ప్రభుత్వ వైద్య విధానపరిషత్ వైద్యశాలలో గురువారం ఈఎన్‌టీ సర్జరీ సేవలను ప్రారంభించారు. ఏరియా ఆసుపత్రిలో అత్యాధునిక పరికరాలతో ఎండోస్కోపిక్ సైరస్‌సర్జరీ చేశారు. పట్టణంలోని స్టేషన్‌బస్తీకి చెందిన అబ్దుల్ కలీం అనే వ్యక్తి గత 12 సంవత్సరాలుగా ముక్కుదిబ్బడతో శ్వాస తీసుకో వడానికి ఇబ్బంది పడుతూ ఉండేవాడు. ఇల్లెందు ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రవిబాబు ఆధ్వర్యంలో వైద్యశాలలో ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఆపరేషన్ చేసిన వైద్యులను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, కలెక్టర్ జితేష్ వి పాటిల్‌లు అభినందించారు.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 26: విద్యతోనే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని గురువారం ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా గల విగ్రహానికి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మహనీయుల జయంతి వేడుకల సందర్భంగా వారి జీవితం నుంచి నేర్చుకోవాల్సిన అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. సమాజంలో మార్పు కావాలని, నవ సమాజ నిర్మాణం కావాలని ప్రతి ఒక్కరు ఆశిస్తారని, ఆ దిశగా పని చేసిన గొప్ప వ్యక్తుల్లో ఐలమ్మ ఒకరని కలెక్టర్ కొనియాడారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ ఐలమ్మ తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, మహిళా శక్తిని ప్రపంచానికి చాటిచెప్పిన వీర వనిత అని అన్నారు. నేటి సమాజంలో కత్తి కంటే కలం (పెన్ను) గొప్పదని, ప్రతీ ఒక్కరికి చదువు ప్రాముఖ్యత తెలిసిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జ్యోతి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, ఎస్సీ సాధన కమిటీ అధ్యక్షురాలు కే.శ్రీలక్ష్మి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దుంపటి నగేష్, బీసీ సంఘం అడ్వకేట్ మేకల సుగుణారావు, కల్లుగీత సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి అంజయ్య, జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు పిండిప్రోలు రామ్మూర్తి, చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ వెంకటప్పయ్య, ప్రొఫెసర్ బి.వి.రాఘవులు, జక్కుల వెంకట రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేంకటేశ్వర్లు, వెంకన్న, భాస్కర్, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీజన్ వచ్చినప్పుడే తనిఖీలు

- నెలవారి తనిఖీలు ఏవి
- మిల్లర్ల వద్ద దారితప్పుతున్న ధాన్యం

ఖమ్మం, సెప్టెంబరు 26 (ఆంధ్రోజ్యోతిప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో మిల్లర్ల వద్ద ఉన్న ధాన్యం దారితప్పుతుంది. సీజన్ వచ్చినప్పుడు విజిలెన్సు అధికారులు తనిఖీచేయడం తేడాలొస్తే కేసులు నమోదుచేయడం తంతుగా సాగుతుంది. అయితే సివిల్‌సప్లయ్ శాఖలోని డిప్యూటీ తహసీల్దార్లు మండలాల్లో మిల్లర్ల తనిఖీల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వానాకాలం,యాసంగికాలం జిల్లలో పండే ధాన్యం మిల్లర్లకు కేటాయించి క్వింటా ధాన్యానికి 67కేజీల బియ్యం తీసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. గత వానాకాలంలో ఇచ్చిన ధాన్యానికి ఈనెల 30తో గడువుముగుస్తుంది. యాసంగిలోపండిన ధాన్యం బియ్యం ఆడించి తీసుకోవడానిక గడువు మార్చి వరకు ఉంది. ఈసమయంలో మిల్లర్లు ధాన్యాన్ని దారిమళ్లిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో సాగుతున్న తంతు

ఉమ్మడిజిల్లాలో సుమారు 70వరకు రైస్‌మిల్లులున్నాయి. సుమారు 5లక్షల మె.ట.నవరకు ప్రతిఏటా మిల్లింగ్ నిమిత్తం సివిల్ సప్లయ్ అధికారులు ధాన్యాన్ని బియ్యంగా మార్చి రేషన్‌కు తరలించేందుకు ఇస్తున్నారు. వాస్తవానికి ప్రతినెలా ఎంత ధాన్యం మిల్లింగ్ చేసింది. ఎన్ని బియ్యం పంపించారు, స్థానికంగా ఎంత నిలవ ఉన్నది లెక్కలు డిప్యూటీ తహసీల్దార్లు తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలిసి ఉంది. అయితే తూతూ మంత్రంగా తనిఖీలు చేయడం,మిల్లర్లు చెప్పినట్టుగా అధికారులు నడుచుకోవడంతో ప్రతిఏటా ధాన్యం మిల్లింగ్‌లో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుఉకుంటున్నా. కోట్ల విలువైన ధాన్యం పక్కదారిపడుతుంది. ధాన్యం, బియ్యం ధరలు పెరుగుతున్న తరుణంలో ఈధాన్యాన్ని బియ్యంగా మార్చి మిల్లర్లు ప్రైవేటుకు అమ్ముతున్నారు. దీంతో లాభాలు గడిస్తున్నారు. సీజన్ వచ్చి నప్పుడు ధాన్యం ధర తక్కువగా ఉన్నప్పుడు కొనుగోలు చేసి మళ్లీ ధాన్యాన్ని కొందరు మిల్లర్లుసివిల్ సప్లయ్‌శాఖకు కేటాఇయించిన ధాన్యం కోటాలో చూపించడం, కొందరు రేషన్‌బియ్యం ను రీపాలీస్‌చేసి మళ్లీ గోదాంలకు తరలించడం సాగిస్తున్నారు వాస్తవానికి నెలవారీగా డిప్యూటీ తహసీల్దార్లు, సివిల్ సప్లయ్ అధికారులు మిల్లులు తనిఖీచేసినప్పుడు అన్ని లెక్కలు తేల్చాల్సి ఉంది. కానీ జిల్లాలో ఉన్న మిల్లర్లతో ఉన్న సంబంధాలతో కిందిస్థాయిలో అధికారుల చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రభుత్వం ధాన్యంను మిల్లర్లు పక్కదారి పటిస్టిస్తున్నారు. మిల్లులు, గోదాంల వద్ద సీసీకెమేరాలు ఏర్పాటుచేస్తే ఈ అక్రమరవాణ అరికట్టవచ్చు. కొణిజర్ల మండలం ఎస్ఏఆర్ రైస్‌మిల్లులో సివిల్‌సప్లయ్ టాస్కుఫోర్సు బృందం తనిఖీలు చేయగా పెద్దఎత్తున వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించారు. దీనిపై మిల్లుయజమానులపై కేసులు నమోదుచేశారు. 3.50లక్షల క్వింఆటాళ్ల ధాన్యం మిల్లుకు అప్పగిస్తే 99,122క్వింటాళ్ల ధాన్యం మాత్రమే మిల్లింగ్ చేశారని, 2.51లక్షల క్వింటాళ్ల ధాన్యం మిల్లింగ్ చేయలాల్సి ఉండగా ఆధాన్యం కనిపించలేదు. మిల్లింగ్ చేయకుండానే ధాన్యం తరలించారు. ఇది కేవలం ఎస్ఏఆర్ రైస్‌మిల్లులోజరుగుతున్న కదేకాద. జిల్లాలో ఎక్కువశాతం రైస్‌మిల్లుల్లో జరుగుతున్న దందా వ్యాపారం. డిప్యూటీ తహసీల్దార్, సివిల్‌సప్లయ్ అధికారులు నెలవారీగా తనిఖీలు నిర్వహించడం, ఆనివేదికలు జిల్లాస్థాయికి పంపించడం, సీసీకెమేరాలు ఏర్పాటుచేయడం, అలాగే మిల్లింగ్‌కోసం ఇచ్చిన ధాన్యం బస్తాల రంగులు ప్రత్యేకంగా ఏర్పాటుచేయడం ద్వారా కొంతవరకైనా అక్రమాలు తగ్గించవచ్చని కొందరు వ్యాపారులు సూచిస్తున్నారు. ఉమ్మడిజిల్లాలో కేవలం ఒక్క మిల్లుతోనే ఆపకుండా ఇతర మిల్లుల్లోకూడా తనిఖీలు చేస్తే మరికొన్ని అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉంది.



రైస్‌మిల్లులో రికార్డులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రైస్‌మిల్లుపై విజిలెన్స్ అధికారుల దాడి

పెనుబల్లి, సెప్టెంబరు 26: ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వానికి చెల్లించాల్సిన నగదు చెల్లించకపోవడం, నోటీసులకు స్పందించకపోవడంతో గురువారం హైదరాబాద్ విజిలెన్స్ అధికారులు దాడి చేశారు. ఇందుకు సంబంధించి విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మంజిల్లా పెనుబల్లి మండలం టేకులపల్లి గ్రామం పరిధిలో ఉన్న కేపీఆర్ రైస్‌మిల్లు గతేడాది రబీలో పండిన వరి పంటను వేలంలో రూ.2.85కోట్లకు ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వానికి రూ.65లక్షలు మాత్రమే చెల్లించారని, మిగిలిన నగదును చెల్లించాలని మిల్లు యాజమాన్యానికి నోటీసులు పంపించినా స్పందించటం లేదని జిల్లా అధికారులు సంబంధిత శాఖ అధికారులకు నివేదిక అందజేశారు. రైస్‌మిల్లు యజమాని నుంచి రికవరీ కోసం హైదరాబాద్ నుంచి విజిలెన్స్ అధికారులు ఈ దాడులు నిర్వహించారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన నగదును వెంటనే చెల్లించాలని, లేకుంటే మిల్లును బ్లాక్ లిస్టులో పెట్టి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించినట్లు సివిల్‌సప్లయి, విజిలెన్స్ అధికారులు తెలిపారు. మిల్లు యజమానులు రెండు రోజులు గడువు కోరినట్లు సమాచారం.

చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ

సత్తుపల్లి, సెప్టెంబర్26: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా రక్షణ కోసం చట్టాలను పకడ్బందీగా అమలు చేసినప్పుడే పూర్తిగా న్యాయం జరుగుతుందని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ అన్నారు. గురువారం సత్తుపల్లి మండల 5వ ఐద్వా మహాసభ మండలంలోని సిద్దారంలో నిర్వహించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మహిళలు, దళితులు, గిరిజనులపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకోగా అధ్యక్ష,కార్యదర్శులుగా యలగం పార్వతి, జాజిరి జ్యోతిలతో పాటు మరో 13మంది కమిటీ సభ్యులుగా ఉన్నారు. కార్యక్రమంలో మాచర్ల భారతి, మెరుగు రమణ, అంగోతు చిట్టెమ్మ, బొప్పన లక్ష్మీ, జాజిరి శ్రీనివాస్, నాగమణి, మారేశ్వరి, నాగేంద్ర, బండి సత్యవతి, వాసం నిర్మల, వెంకటరమణ, రాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

అక్రమ నిర్మాణం కూల్చివేత


అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

వైరా, సెప్టెంబరు 26: ఎన్నెస్పీ వైరా మేజర్ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని గురువారం వేకువజామున స్థానిక మునిసిపల్ అధికారులు, సిబ్బంది కూల్చివేశారు. మునిసిపల్ కమిషనర్ చింతా వేణు ఆధ్వర్యంలో పక్కా ప్రణాళికతో పోలీసు బందోబస్తు మధ్య యంత్రాల సాయంతో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. మునిసిపాలిటీ 14వ వార్డు పరిధిలోని ఎన్నెస్పీ మేజర్ కాల్వ స్థలంలో ఒక ఇంటిని అక్రమంగా నిర్మిస్తున్నారు. ఇదే అదునుగా భావించి స్థానికులు మిగిలిన ఎన్నెస్పీ స్థలాల ఆక్రమణకు పూనుకున్నారు. ఎన్నెస్పీ స్థలాల్లో హద్దులు నిర్ణయించుకుంటూ చీరలు, తాళ్లు ఏర్పాటుచేసుకున్నారు. ఈ వ్యవహారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు ఖమ్మం ఆర్డీవో గుంటుపల్లి గణేష్ బుధవారం వైరా వచ్చి స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఈ అక్రమ నిర్మాణాలు తొలగించాలని మునిసిపల్ కమిషనర్ వేణును ఆదేశించారు. ఆవెంటనే కమిషనర్ వేణు పక్కా ప్రణాళికతో ఈ అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. ఆసమయంలో కొంత ఉద్రిక్తత చోటుచేసుకుంది.

తమ్మిలేరులో వ్యక్తి గల్లంతు

వేంసూరు, సెప్టెంబరు 26: వేంసూరు మండలం కందుకూరు తుంగావారి కాలనీకి చెందిన తుంగా రామారావు(51) తమ్మిలేరు వాగులో కొట్టుకుపోయాడు. బుధవారం పశువులను మేపేందుకు వెళ్లిన రామారావు తిరిగి ఇంటికి వచ్చే సమయంలో వాగు దాటుతుండగా ప్రమాదవశాత్తూ పడి కొట్టుకుపోయాడు. గురువారం సాయంత్రం వరకు రామారావు ఆచూకీ లభించలేదు. అధికారులు, పోలీసుల పర్యవేక్షణలో గాలింపు చర్యలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


మిద్దె రాము(ఫైల్)

చుంచుపల్లి, సెప్టెంబరు 26: రోడ్డుపై ఆగి ఉన్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి అతివేగంతో లారీ ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడెం పట్టణంలోని మెయిన్ హాస్పిటల్ ఏరియాకు చెందిన మిద్దె రాము(47) సొంత పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై చుంచుపల్లి మండలంలోని త్రీ ఇంక్లైన్ పంచాయతీ కార్యాలయం సమీపానికి వెళ్లాడు. ఈ క్రమంలో విజయవాడ నుంచి కొత్తగూడెం వైపునకు వస్తున్న ఓ లారీ ఆ ప్రాంతంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బలంగా ఢీకొంది. ట్రాక్టర్ ముందు ద్విచక్ర వాహనంపై వేచి ఉన్న రాముపై ట్రాక్టర్ ట్రాలీ ఎగిరి పడింది. దీంతో తీవ్ర గాయాలైన రామును స్థానికులు కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలిస్తుండగా మార్గ మధ్యలో గుండెపోటు రావడంతో మృతి చెందాడు. మృతుడు రాముకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గతంలో వివిధ పత్రికల్లో జర్నలిస్టుగా పని చేయగా పలువురికి రాము సుపరిచితుడు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


రాము (ఫైల్)

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 26: ఆర్థిక ఇబ్బందులు తాళలేక కొత్తగూడెంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు.. పాల్వంచ నవభారత్ ప్రాంతానికి చెందిన వడ్లమూడి రాము(35) తన భార్య, రెండు సంవత్సరాల వయస్సు కలిగిన బాబుతో కొత్తగూడెం పట్టణంలోని కూలీ లైన్ ప్రాంతంలో అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. కొత్తగూడెంలో ఓ ప్రవేటు బ్యాంకులో క్రెడిట్ కార్డు రికవరీ మేనేజర్‌గా పని చేస్తున్న రాము ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఆ అప్పులను చెల్లించలేక మనో వేధనకు గురవుతున్నాడు. అదేవిధంగా తీవ్ర పని ఒత్తిడి భరించలేక పురుగుల మందు సేవించాడు. ఇది గమనించిన భార్య, స్థానికుల సహాయంతో కొత్తగూడెంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో మరణించాడు. ఈ సంఘటనపై త్రీటౌన్ ఎస్ఐ పురుషోత్తం సంఘటన స్థలానికి చేరుకొని భార్య ప్రసన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పొట్లాలు స్వాధీనం

సుజాతనగర్, సెప్టెంబరు 26: అనుమానాస్పదంగా పడి ఉన్న గంజాయి పొట్లాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గురువారం సుజాతనగర్ మండలం వేపలగడ్డ గ్రామం వద్ద గల ఆర్వోబి వంతెన పక్కన చేలో అనుమానాస్పదంగా ఉన్న పొట్లాలు పడి ఉన్నాయని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ జుబేదా బేగం తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని వాటిని పరిశీలించారు. అవి గంజాయి పొట్లాలని నిర్ధారించి వాటిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వ్యక్తికి ఐదురోజుల జైలు

వైరా, సెప్టెంబరు 26: వైరాలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో బసవ అప్పలరాజు అనే వ్యక్తికి మధిర ఫస్ట్ అడిషనల్ కోర్టు న్యాయాధికారి ఐదురోజుల జైలు శిక్ష విధించారు. గురువారం అప్పలరాజును మధిర కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి శిక్ష విధిస్తూ ఆదేశాలిచ్చారు. కోర్టు కానిస్టేబుల్ నర్సింహారావును ఉన్నతాధికారులు అభినందించారు.

రోడ్డు పక్కకు దూసుకెళ్లిన మినీవ్యాన్

కొణిజర్ల, సెప్టెంబరు 26: రోడ్డు మీద పడిన భారీ గుంతలను తప్పించబోయి ప్రయాణికులతో ఉన్న మినీవ్యాన్ రోడ్డు పక్కకు దూసుకెళ్లిన సంఘటన మండల పరిధిలోని పల్లిపాడు సమీపంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు పరిశీలిస్తే అన్నవరం దైవ దర్శనానికి వెళ్లి తిరిగి కరీంనగర్ వెళ్తున్న పది మంది ప్రయాణికులతో ఉన్న మినీవ్యాన్ పల్లిపాడు సమీపంలో రోడ్డు ఉన్న భారీ గుంతలను తప్పించబోయి రోడ్డు ప్రక్కకు దూసుకెళ్లింది. కొద్దిగా ముందుకు వెళ్లితే భారీ ప్రమాదం జరిగేదని వ్యాన్‌లో ఉన్న ప్రయాణికులు భయాందోళన చెందారు. డ్రైవర్ చాకచక్యంగా నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. రోడ్డు ఉన్న గుంతలను పూడ్చితే ఇలాంటి ప్రమాదాలు జరిగేవికావని వాహణదారులు వాపోతున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఎర్రుపాలెం, సెప్టెంబరు 26: మండలంలోని మీనవోలు గ్రామశివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం జరిగింది. ఎర్రుపాలెం ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం మధిర పట్టణానికి చెందిన షేక్ షారుఖ్ (26) తన తండ్రి గౌస్‌మోహిద్దీన్ మీనవోలు గ్రామంలో గల జిల్లాపరిషత్ పాఠశాలలో పనిచేస్తూ అస్వస్థతకు గురయ్యాడు. తన తండ్రి వీఆర్ఎస్ కోసం ధృవపత్రాలు పాఠశాలలో అందించి మధిరకు వస్తుండగా మీనవోలు శివారులో విజయవాడ నుంచి మధిర వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం వెనుకనుంచి ఢీకొనడంతో అదే వాహనం కింద పడి షారుక్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

భూ తగాదాపై కేసు నమోదు

ఖమ్మం రూరల్, సెప్టెంబరు 26: భూ తగాదా విషయంలో జరిగిన ఘర్షణపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలం పరిదిలోని మంగళగూడెం గ్రామానికి చెందిన వీరెల్లి సత్యనారాయణ వ్యవసాయ భూమిలోకి అదే గ్రామానికి చెందిన వీరెల్లి అప్పారావు బుధవారం అక్రమంగా ప్రవేశించి భూమిని దున్నాడు. దీంతో సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పారావుపై కేసునమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

ఆక్రమణకు గురైన ఎన్నెస్పీ కాల్వ పరిశీలన

వైరా, సెప్టెంబరు 26: ఆక్రమణలకు గురైన ఎన్నెస్పీ వైరా మేజర్ స్థలాలను గురువారం తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు పరిశీలించారు. ఆక్రమణదారులతో మాట్లాడి ఎన్నెస్పీ స్థలాలను ఖాళీ చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నెస్పీ స్థల హద్దులను రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఎన్నెస్పీ స్థలాలను ఆక్రమిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని తహసీల్దార్ హెచ్చరించారు. వైరా మునిసిపల్ కమిషనర్ చింతా వేణు, గిర్దావర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పూర్తిగా నిండిన కిన్నెరసాని

పాల్వంచ రూరల్, సెప్టెంబరు 26: కిన్నెరసాని ప్రాజెక్టు నిండింది.. పూర్తి సామర్థ్యానికి చేరింది.. జలకలతో తొనికిసలాడుతోంది.. గురువారం 407 అడుగులకు నీటి మట్టం చేరింది. ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు ప్రవాహం ప్రాజెక్టుకు చేరుతుంది. 7వేల క్యూసెక్కుల చొప్పున నీరు చేరుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టు అసలు సామర్థ్య 407 అడుగులు కాగా పూర్తిస్థాయికి చేరడంతో అధికారులు నీటిని రాత్రి సమయంలో విడుదల చేస్తున్నారు. 1, 2 గేట్లు ఎత్తి 5 నుంచి10వేల క్యూసెక్కుల వరకు నీటిని దిగువ ప్రాంతాని కి వదులుతున్నారు.

ఇక కమర్షియల్ లెక్క పక్కా..

» రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ సంయుక్త సర్వే » ఖమ్మానికి నలు దిక్కులా డంపింగ్‌యార్డులు » కమిషనర్‌కు మేయర్ సూచనలు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 26: ఖమ్మం నగరంలోని పది డివిజన్లలో సాధారణ నివాసాలు సైతం కమర్షియల్ వ్యాపారాలకు కేంద్రాలుగా మారాయి. కేఎంసీ అధికారుల నుంచి భవనాలకు అనుమతి సమయంలో కింది ఫ్లోర్‌లను పార్కింగ్ ప్రాంతాలుగా చూపుతున్నారు. తీరా వ్యాపారాలు మొదలైన తర్వాత పార్కింగ్ ప్రాంతా లను కమర్షియల్‌గా వాడుతున్నారు. దీంతో ఖమ్మం నగర పాలక సంస్థకు రావాల్సిన ఆదాయం కోల్పోతుంది. ఈ క్రమంలో గురువారం ఖమ్మం మేయర్ పునకొల్లు నీరజ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో మేయర్ ఛాంబర్‌లో ప్రత్యేకంగా సమావేశమైనారు. ఖమ్మం నగరంలో ఇప్పటి వరకు అధికారికంగా 83వేల కమర్షియల్ భవనాలకు మాత్రమే పన్ను వసూళ్లు జరుగుతున్నాయని, వాస్తవ లెక్కలను మరోసారి పరిశీలించాలని సూచించారు. ఎన్నో ఏళ్లగా నివాసాలుగా ఉన్న భవనాలను కమర్షియల్ భవనాలుగా వాడుతున్న వాటి లెక్కలను బయటకు తీయాలని సూచించారు. ప్రతి భవనానికి మరోసారి పూర్తి స్థాయి లెక్కలు నమోదు చేయటం ద్వారా పన్ను ఎగవేతలను తగ్గించాలని, గత కొన్ని నెలలుగా భవనాలపై ఆదనపు గదులు నిర్మాణం జరిపిన వాటికి ట్యాక్స్ వేయటం లేదని మేయర్ తన దృష్టికి వచ్చిన విషయాలను కమిషనర్‌కు వివరించారు.

ఖమ్మం నగర పాలక సంస్థలోని రెవెన్యూ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగాలు సంయుక్తంగా సర్వే నిర్వహించటం ద్వారానే కమర్షియల్ భవనాల ఖచ్చితమైన లెక్కలు తేలుతాయని అందుకోసం ప్రత్యేకంగా డ్రైవ్ చేపట్టాలని మేయర్ నీరజ కమిషనర్ అభిషేక్‌కు సూచించారు. ఈ మేరకు మేయర్, కమిషనర్ ఒకే నిర్ణయానికి రావటంతో త్వరలో ఖమ్మం నగరంలోని కమర్షియల్ భవనాల లెక్క మరోసారి తేలనుంది.



సమస్యగా చెత్త తరలింపు

పది రోజులుగా ఖమ్మం నగరంలోని చెత్తను డంపింగ్ యార్డుకు తరలించటం పెద్ద సమస్యగా మారింది. 60 డివి జన్ల చెత్తను ఒకే ప్రాంతంలోని డంపింగ్‌యార్డుకు తరలిం చటంతో సమీపంలోని ప్రజలు పది రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టి పారిశుధ్య వాహనాలను అడ్డుకుంటు న్న విషయాలపై కమిషనర్‌తో మేయర్ సమీక్షించారు. నగరానికి నలు దిక్కులు డంపింగ్‌యార్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఖమ్మం నగర పాలక సంస్థలో విలీనమైన ప్రాంతాలు గ్రామ పంచాయతీలుగా ఉన్న సమయంలో ఏ ప్రాంతంలో డంపింగ్‌లు జరిగాయో ఆయా ప్రభుత్వ స్థలాలను పరిశీలించి అన్ని ప్రాంతాల్లో డంపింగ్‌యార్డులు ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు మేయర్ పునకొల్లు నీరజ సూచించారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

● బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోదరావు


సభ్యత్వ నమోదులో పాల్గొన్న వినోదరావు

జూలూరుపాడు, సెప్టెంబరు 26: అర్హులైన రైతులందరికి రూ.2లక్షల రుణమాఫీ చేయకుండా, ఖరీఫ్ సీజన్ ముగిస్తున్నప్పటికి రైతు భరోసా డబ్బులను రైతుల ఖాతాల్లో జమచేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసంచేసిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోదరావు ఆరోపించారు. గురువారం ఆయన మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజలకు అనేక వాగ్దానాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్న హామీలను నేరవేర్చడంతో పూర్తిగా విఫలమైందన్నారు. రైతులకు పరిహారం చెల్లించకుండానే వారి భూముల్లో సీతారామ కాలువ నిర్మాణాన్ని చేపట్టడం తగదన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, వైరా నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ నెల్లూరు కోటేశ్వరరావు, నాయకులు మాదినేని సతీష్, తెల్లం నరసింహారావు, నున్నా రమేష్, ప్రసాద్, వంశీ, చంద్రశేఖర్, శ్రీను పాల్గొన్నారు.

మోటర్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలి

● రైతులకు ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మహేందర్ సూచన


రైతులతో మాట్లాడుతున్న ఎస్ఈ మహేందర్

జూలూరుపాడు, సెప్టెంబరు 26: వినియోగదారులకు, రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామని, నాణ్యమైన పరికరాలను వాడాలని ఎన్‌పీడీసీఎల్ భద్రాద్రి జిల్లా ఎస్ఈ మహేందర్ తెలిపారు. మండలంలోని అనంతారం గ్రామంలో గురువారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు పొలంబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యుత్ పొదుపు, ప్రమాదాల సంబవించకుండా తీసుకోవల్సిన భద్రతలపై ఆయన వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు విద్యుత్ మోటర్లకు ఐఎస్ఐ మార్కు కలిగిన కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. విద్యుత్‌ను పొదుపుగా వినియోగించి ఆదా చేయాలని అన్నారు. నాసిరకం పరికరాలని వాడవద్దని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విధంగా వినియోగదారులకు, రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. డీఈ రంగస్వామి, ఏడీఈ యాసిన్, ఏఈ సతీష్‌కుమార్, సిబ్బంది ప్రవీణ్, కెవి. నరసింహారావు, రమేష్, భాస్కర్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఎస్సీ, ఎస్టీ పాలిటెక్నిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు

చుంచుపల్లి, సెప్టెంబరు 26: ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు అయింది. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా బి.నాగముని నాయక్, కె.సాంబయ్య, సలహాదారులుగా తారాసింగ్‌ను నియమించినట్లు నూతన ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బి.కరుణకుమార్ గురువారం తెలిపారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా డి.కన్నా, ఉపాధ్యక్షులుగా జి.ఉదయభాస్కర్, సీహెచ్.రవికుమార్, కోశాదికారిగా డి.శషాంక్, మహిళా కార్యదర్శిగా డాక్టర్ పి.వనిత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.రామకృష్ణ, పబ్లిసిటీ సెక్రటరీగా డి.సందీప్, ఎగ్జిక్యూటీవ్ సభ్యులుగా ప్రవీణ్, భాగం కృష్ణ, కర్ణ తదితరులు ఎంపికైనట్లు తెలిపారు.

భద్రాద్రిలో కేంద్ర నిఘా కార్యాలయం

» రూ.3 కోట్లతో నిర్మాణ పనులకు రంగం సిద్ధం » జూలై నాటికి పూర్తయ్యేలా చర్యలు
» డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో నిఘా కార్యకలాపాలు

భద్రాచలం, సెప్టెంబరు 26: ఆంధ్రా-చత్తీస్‌ఘడ్ సరిహద్దుల్లో నియోజకవర్గ కేంద్రమైన భద్రాచలంలో కేంద్ర నిఘా కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయగా నిర్మాణ పనులు త్వరలో చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. ఆర్టీసీ బస్టాండు వెనుక వీధిలో పాత ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సమీపంలో 16 సెంట్ల స్థలంలో జీ+1 ప్రాతిపదికన నిర్మాణాలు చేపట్టానున్నట్లు తెలుస్తోంది. పూర్తిగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన చత్తీస్‌గడ్, ఏపీ సరిహద్దుల్లో భద్రాచలం కేంద్రంగా ఏర్పాటు చేస్తున్న ఈ కార్యాలయం ద్వారా నిఘా కార్యకలాపాలు డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు వినికిడి. కార్యాలయంతో పాటు సిబ్బంది క్వార్టర్లను సైతం అక్కడే నిర్మించనున్నట్లు తెలుస్తోంది. ఈ పనులను వచ్చే ఏడాది జూలైలోపు పూర్తి చేసి అధికారికంగా కార్యకలాపాలు సాగించనున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఈ భవన నిర్మాణం కోసం స్థలానికి ఆనుకొని ఉన్న తాత్కాలిక షెడ్లను భద్రాచలం పంచాయతీ అధికారులు గురువారం తొలగించారు.

6న ఖమ్మంలో 'కథ-2023' సంకలనం ఆవిష్కరణ

● హాజరుకానున్న 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్

ఖమ్మం సెప్టెంబరు 26: జామవా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో అక్టోబరు 6న ఖమ్మం నగరంలో కథ-2023 సంకలనాన్ని ఆవిష్కరించనున్నారు. ఖమ్మం జడ్పీ సమావేశంలో మందిరంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సభలో ప్రముఖ సాహితీ వేత్త కె.శివారెడ్డితో పాటు కథా సాహితీ సంపాదకులు వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్, ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు పాల్గొంటారు. ఈ పుస్తకానికి కథలను అందించిన రచయితలు కుప్పిలి పద్మ, కత్తి పద్మ, బెజ్జారపు రవీందర్, పాణిని జన్నాభట్ల, అఫ్సర్, వేంపల్లి షరీఫ్, యాజీ, స్ఫూర్తి కందివనం, సుజాత వేల్పూరి అనిసెట్టి శ్రీధర్, డా.కెవీ రంగారావు, దేశరాజు, సతీష్ చందర్, ఛాయ మోహన్ బాబు, పి. శ్రీనివాస్ గౌడ్‌లతో సాహితీవేత్త ఏపీ రమణమూర్తి ముఖాముఖి నిర్వహిస్తారు. రచయితలు తమ కథల నేపథ్యాన్ని వివరిస్తారు.

పామాయిల్ ఫ్యాక్టరీలను సందర్శించిన మలేషియా ఇంజనీర్లు


అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించిన మలేషియాకి చెందిన ఇంజనీర్ల బృందం

దమ్మపేట, సెప్టెంబర్ 26: మలేషియాకు చెందిన వైకేపీఎల్ కంపెనీకి చెందిన ఇంజనీర్ల బృందం గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అప్పారావుపేట, అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలను సందర్శించింది. హైదరాబాద్ ఫ్యాక్టరీస్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డితో కలిసి మలేషియా ఇంజనీర్లు ఈ ఫ్యాక్టరీలను పరిశీలించారు. క్రషింగ్‌లో అత్యధికంగా ఓఈఆర్(ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేట్) వచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఇంజనీర్లతో కలిసి చర్చించారు. అప్పారావుపేట ఫ్యాక్టరీలో మిషనరీ పనితీరు బాగుందని మలేషియా ఇంజనీర్లు తెలిపారు. ఫ్యాక్టరీ పనితీరుపై పలు సలహాలు సూచనలు చేశారు. వారి వెంట డివిజనల్ మేనేజర్ బాలకృష్ణ, అప్పారావుపేట, అశ్వారావుపేట మేనేజర్లు కళ్యాణ్, నాగుబాబు, సిబ్బంది ఉన్నారు.

3నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

» పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి » అధికారులతో సమీక్షలో అదనపు కలెక్టర్ శ్రీజ


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 26: జిల్లాలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు. గురువారం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లో ఆమె అధికారులతో సమీక్షించా రు. ఓపెన్ స్కూల్ సొసైటీ టెన్త్, ఇంటర్ పరీక్షల షెడ్యూల్, జిల్లాలో పరీక్ష రాస్తున్న విద్యార్థుల సంఖ్య, పరీక్ష నిర్వాహణకు చేస్తున్న ఏర్పాట్లు తదితర అంశాలను అధికారులు వివరించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అక్టోబరు 3 నుంచి 9 వరకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు జిల్లా నుంచి 340 మంది టెన్త్ అభ్యర్థులు, 373 మంది ఇంటర్ అభ్యర్థులు హాజరు కానున్నారని, పరీక్షలను సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఖమ్మంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఓపెన్ 10వ తరగతి పరీక్షలు, రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఇంటర్ పరీక్షల నిర్వహణకు పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశామని, ఈ పరీక్షా కేంద్రాలలో అవసరమైన అన్ని రకాల మౌళిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ అన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు సెషన్లలో జరుగుతాయన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె. రవిబాబు, ఉప జిల్లా వైద్యాధికారి డాక్టర్ సైదులు, ఖమ్మం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ ఏ. సంపత్ కుమార్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ కె. సతీశ్, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ ఏసీజీ ఈ.కె. ధన, జిల్లా కో ఆర్డినేటర్ ఎం. పాపారావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రేమపేరుతో బాలికను గర్భవతిని చేసిన యువకుడు

» ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన » పోక్సోకేసు నమోదు చేసిన ఆళ్లపల్లి పోలీసులు

ఆళ్లపల్లి, సెప్టెంబరు 26: ప్రేమపేరుతో 15 ఏళ్ల బాలికను లొంగదీసుకుని గర్భవతిని చేసిన యువకుడిపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలానికి చెందిన ఓ బాలిక ఫిబ్రవరిలో ఆళ్లపల్లి మండల కేంద్రంలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లింది. అక్కడ ఆ బాలికకు పరిచయస్తుడైన ఆళ్లపల్లి ప్రాంతానికి చెందిన కార్తిక్ అనే యువకుడు ప్రేమపేరుతో మాయమాటలు చెప్పి బాలికను లొంగదీసుకున్నాడు. బాలికను నాయనమ్మ ఇంట్లో ఉంచి కుటుంబ పోషణకోసం ఇతర ప్రాంతంలో ఉంటున్న బాలిక తల్లిదండ్రులు ఆగస్టు 12న ఇల్లెందుకు వచ్చారు. ఈ క్రమంలో తమ కుమార్తెకు కాళ్ల వాపులు ఉండటంతో ఆగస్టు 13న ఇల్లెందు ఆస్పత్రిలో చూపించగా వైద్యులు పరీక్షించి బాలిక గర్భవతి అని చెప్పారు. తల్లిదండ్రులు బాలికను గట్టిగా నియదీయడంతో జరిగిన విషయం చెప్పింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గురువారం ఆళ్లపల్లి ఎస్ఐ రతీస్, యువకుడిపై పోక్స్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

3 నుంచి శ్రీరామాయణ మహాపారాయణ మహోత్సవం

● వైదిక సిబ్బందికి విధుల కేటాయింపు

భద్రాచలం, సెప్టెంబరు 26: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అక్టోబరు మూడు నుంచి 12 వరకు శ్రీరామాయణ మహాపారాయణ మహోత్సవం నిర్వహించనున్నారు. శ్రీరామాయణ హవనం నిర్వహించనుండగా ఇందులో వైదిక సిబ్బందికి విధులు కేటాయిస్తూ దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు ఎ. విజయరాఘవన్, వేద పండితులు సీహెచ్ హనుమత్‌శాస్త్రి, కామేశ్వర శర్మ, ఉప ప్రధాన అర్చకులు ఎ. మురళీకృష్ణమాచార్యులు, రామానుజాచార్యులు, ముఖ్య అర్చకులు పి. రామభద్రాచార్యులు, అర్చకులు ఎ. వెంకటరామన్, వైదిక సిబ్బంది ఎస్. భాస్కరాచార్యలతో పాటు పి. శివకు విధులు కేటాయించారు.

రుణం కావాలంటే బీమా కట్టాల్సిందే..

» రైతుల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న బ్యాంకర్లు » నేతలు నిలదీయడంతో రుణం ఇచ్చేందుకు అంగీకారం


దుమ్ముగూడెం సెప్టెంబరు 26: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించనట్లుంది రుణమాఫీ విషయంలో రైతుల పరిస్థితి.. రైతులను రుణ విముక్తులను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రుణ మాఫీ చేయగా ఆ పైసలు మాత్రం పూర్తిగా రైతుల చేతికందడం లేదు. వ్యవసాయ అవసరాలకు నగదు చేతికొస్తుందని ఆశపడి బ్యాంకులకు వెళ్తున్న రైతులకు కొందరు బ్యాంకు మేనేజర్లు బలవంతంగా డిపాజిట్లు, ఇన్సూరెన్స్ పాలసీలతో రుణమాఫీ సొమ్ములో కోతలు పెడుతున్నారు. ఇన్సూరెన్సు పాలసీ విధానంపై పూర్తి అవగాహన కల్పించకుం డానే తమ చేతిలో డబ్బులున్నాయనే అధికారంతో ఎడాపెడా పాలసీలు చేయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దుమ్ము గూడెం మండలంలోని నరసాపురం ఏపీజీవీబీ శాఖలో జరిగిన ఈ వ్యవహారంపై బాధిత రైతులు ఏపీజీవీబీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. బాధిత రైతుల తరపున నరసాపురానికి చెందిన కొందరు నేతలు గురువారం మేనేజర్‌ను నిలదీయడంతో పూర్తి రుణాన్ని ఇచ్చేందుకు అంగీకరించారు. అలాగే ఒక బ్యాంకు మిత్ర చేస్తున్న ఆగడాలతో వృద్ధులు, ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నరసాపురం ఏపీజీవీబీలో రైతుల ఇక్కట్లు

బండారుగూడేనికి చెందిన కుర్సం భద్రయ్యకు రూ1.50లక్షల రుణమాఫీ వచ్చింది. తిరిగి రుణం తీసుకుందామని నరసాపురం ఏపీజీవీ బ్యాంకుకు వెళితే రూ.50వేల నగదును డిపాజిట్ చేస్తేనే రుణమిస్తాననడంతో సదరు రైతు అంగీకరించలేదు. దాంతో అతడిని నెలరోజులుగా బ్యాంకు చుట్టూ తిప్పుకుంటున్నారు. అలాగే మారేడుబాకకు చెందిన భద్రమ్మ అనే ఆదివాసీ మహిళా రైతుకు రూ80వేల రుణమాఫీ వచ్చింది. తిరిగి రుణం మంజూరు చేసే క్రమంలో రూ20వేలను డిపాజిట్ పేరిట బలవంతంగా ఆపారు. వీటిపై బాధిత రైతులు ఏపీజీవీబీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానిక సీపీఐ నాయకులు రావుపల్లి రవికుమార్, బొల్లోజు వేణులు గురువారం ఈ విషయమై మేనేజర్‌ను నిలదీయడంతో కొందరి రైతుల ఇన్సూరెన్సు పాలసీలను రద్దు చేసి నగదు తిరిగిచ్చారు.

మితిమీరిన బ్యాంకు మిత్ర ఆగడాలు

నరసాపురం ఏపీజీవీబీ శాఖలోని ఓ బ్యాంకు మిత్ర భర్త ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని పలువురు బ్యాంకు ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. అమాయక ఖాతాదారులకు అధిక వడ్డీలకు అప్పులివ్వడం, ఏటీఎం కార్డులను తాకట్టు పెట్టుకోవడం, సర్వీసు పేరిట పింఛనుదారుల నుంచి అక్రమంగా నగదు వసూలు చేయడం వంటి పలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.



చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి: రాయల

ముదిగొండ, సెప్టెంబరు 26: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సూచించారు. గురువారం ముదిగొండ జడ్పీఉన్నత పాఠశాలలో జరిగిన ముదిగొండ, నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల జోనల్‌స్థాయి క్రీడలను నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలను ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వం తీర్చిదిద్దుతుందని పేర్కొన్నారు. నేను కూడా ఇదే పాఠశాలలో చదువుకున్నానని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు తనవంతు కృషిచేస్తానని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు రమణయ్య, చలపతిరావు, శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు వెంకట్రామిరెడ్డి, శాంతి, మాజీ వైస్ఎంపీపీ మంకెన దామోదర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు పాల్గొన్నారు.

వీరవనిత చాకలి ఐలమ్మ

చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన వీర వనిత అని వక్తలు కొనియాడారు. ఐలమ్మ 129వ జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లావ్యాప్తంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. సత్తుపల్లిలో ఎమ్మెల్యే మట్టా రాగమయి దోబీఘాట్, బీఎస్ఎన్ఎల్ ఆఫీసుల వద్ద ఆమె విగ్రహాలకు పూలమాలలు వేసి కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. మధిరలో జరిగిన కార్యక్రమలో జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు పాల్గొన్నారు. - నెట్‌వర్క్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి



నివాళులర్పిస్తున్న కమాండెంట్, సిబ్బంది



కలెక్టరేట్‌లో...



పూలమాల వేస్తున్న కమల్‌రాజు



బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో..



వీఎంబంజర్‌లో



నేలకొండపల్లిలో..



తల్లాడలో...

దసరా సెలవులను కచ్చితంగా అమలు చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు26: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన దసరా సెలవులను ప్రతీ ప్రైవేటు స్కూల్స్ కచ్చితంగా అమలుపరచాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొరకొప్పు.రామారావు అన్నారు. గురువారం డీఈవో సోమశేఖర్‌శర్మని కలిసి వినతి పత్రం అందించారు. దసరా సెలవుల్లో వర్క్ షాప్‌లు గాని, స్టడీ అవర్స్ గానీ, ప్రత్యేక తరగతులు కానీ ఏ ఇతర ప్రభుత్వ విద్యా వ్యతిరేక చర్యలు ప్రైవేట్ స్కూల్స్ చేపట్టకూడదని అన్నారు. సెలవులను ప్రైవేట్ స్కూల్స్ అమలుపరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి నాగరాజు, ఈ సురేష్, టీ లావణ్య పాల్గొన్నారు.

పోషకాహారం అందించాలి

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు26: గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు అంగన్వాడి సెంటర్లలో పోషకాహారం అందించాలని 49వ డివిజన్ కార్పోరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పోషణమాసం సందర్భంగా 49డివిజన్ మామిళ్ళగూడెం లో అంగన్వాడి సెంటర్‌లో పోషణ మాసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.49 డివిజన్లో గర్భిణులు ఏఎన్ఎం రాజేశ్వరిని సంప్రదించాలన్నారు. అనంతరం శ్రీమంతాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీడీపీవో వీరభద్రమ్మ, సూపర్వైజర్ సుధా భవాని, అంగన్వాడి టీచర్ ఇందిరా రెహామునిషా, రమణ, సరస్వతి పాల్గొన్నారు.

డిజిటల్ ఉపవాసం అలవర్చుకోవాలి

- మహాసహస్ర అవధాని గరికపాటి నరసింహారావు
- ఎస్‌బీఐటీ కళాశాలలో ఓరియంటేషన్ కార్యక్రమానికి హాజరు

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు26: విద్యార్థులు ఫోన్లు, టెలివిజన్ వంటి వ్యాపకాలు మాని వారంలో రెండు రోజులు డిజిటల్ ఉపవాసం అలవర్చుకోవాలని పద్మశ్రీ పురస్కార గ్రహీత, మహాసహస్ర అవధాని గరికపాటి నరసింహారావు సూచించారు. తద్వారా విద్యపై దృష్టిని కేంద్రీకరించగలుగుతారన్నారు. గురువారం నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో నిర్వహించిన మొదటి సంవత్సర విద్యార్థుల ఓరియంటేషన్ ప్రోగ్రాంలో విశిష్ట అతిథిగా ఆయన పాల్గొన్నారు. తల్లిదండ్రులు గురువుల ప్రాముఖ్యతను గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మోయలేనిభారం వల్లనే ఒత్తిడి పెరుగుతుందన్నారు. గురువులతో చర్చించడంతో ఎలాంటి ఒత్తిడినైనా జయించవచ్చని వారు తెలిపారు. విద్యను అభ్యసిస్తూనే దేశఅభివృద్ధి గురించి ఆలోచించాలని పేర్కొన్నారు. గరికపాటి విద్యార్థులతో ముఖాముఖి చర్చించి వారితో ప్రశ్నోత్తరాలలో పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ ఉన్నత విద్యా ప్రమాణాలు పాటించటంతో పాటు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఈవిద్యాసంవత్సరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 100 శాతం అడ్మిషన్లు కలిగిన కళాశాలగా నిలవటం ఇది మా కళాశాలపై బాధ్యతను పెంచిందన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి ప్రిన్సిపల్ జి.రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ కె. అమిత్ బిందాజ్, అకడమిక్ డైరెక్టర్స్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ. శివ ప్రసాద్, జి. ప్రవీణ్ కుమార్, జె.రవీంద్రబాబు, యన్.శ్రీనివాసరావు, హెచ్‌వోడీలు తదితరులు పాల్గొన్నారు.



గరికపాటిని సన్మానిస్తున్న కళాశాల చైర్మన్ కృష్ణ

బయో మైనింగ్ వేగంగా జరపాలి

కమిషనర్ అభిషేక్ అగస్త్య



డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న కమిషనర్

ఖమ్మంసంక్షేమవిభాగం, సెప్టెంబరు26: ఖమ్మం డంపింగ్ యార్డులో జరుగుతున్న బయో మైనింగ్ వేగంగా జరపాలని, నగరం నుంచి చెత్త డంపింగ్ యార్డుకు తరలించే సమయంలోనే తడి, పొడి చెత్తను వెర్వేరుగా చేయాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. గురువారం డింపింగ్‌యార్డును కమిషనర్ పరిశీలించారు. బయోమైనింగ్, ప్లాంటేషన్‌తో పాటుగా దుర్వాసన రావటానికి గల కారణాలను అసిస్టెంట కమిషనర్‌తో మాట్లాడి తెలుసుకున్నారు. అనతరం యానిమల్ బర్త్ కేర్ సెంటర్‌ను తనిఖీ చేశారు. జంతువులకు జరుగుతున్న అపరేషన్లపై సమీక్షించారు. అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్, ఈఈ కృష్ణలాల్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సంతృప్తికర వైద్యం అందించాలి

డీసీహెచ్ఎస్ రాజశేఖరగౌడ్

సత్తుపల్లిరూరల్, సెప్టెంబర్26: వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేసి ఆసుపత్రికి వచ్చే రోగులకు సంతృప్తికర వైద్యం అందించాలని డీసీహెచ్ఎస్ రాజశేఖరగౌడ్ కోరారు. గురువారం సత్తుపల్లిలోని సీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా సందర్శించి వైద్యులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మనమంతా మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా పనిచేయాలని, విధుల పట్ల ఎవరూ నిర్లక్ష్యం చూపవద్దని, సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వైద్య సేవలు, రోజూ వస్తోన్న రోగుల సంఖ్యపై వైద్య అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వంద పడకల ఆసుపత్రి త్వరలోనే రోగులకు అందుబాటులోకి వస్తుందన్నారు. వైద్యులు రాజేష్, నారాయణ, సురేష్, ప్రణయ్, నారాయణమ్మ, జయలక్ష్మీ, సాత్విక్ పాల్గొన్నారు.

ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

- అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్,సెప్టెంబరు26: ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు మనం ఆహ్లాదాన్ని పంచాలి కానీ అనారోగ్యాన్ని కాదని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. గురువారం ఆమె ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ ఓపీ నమోదు, క్యాజువాలిటీలో అందుతున్న సేవలు పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం దుర్వాసన వస్తుండడంతో ఆమె వీటిని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మందుల గోదామును సందర్శించారు. ఇక్కడ స్టాకు రిజిస్టర్‌లో డంప్ అయిన మందుల్లో వ్యత్యాసం ఉండడం పట్ల ఆమె అధికారులను నిలదీశారు. సదరం క్యాంపుల సర్టిఫికెట్లను తక్షణమే లబ్దిదారులకు పంపించాలని సూచించారు. ఆస్పత్రి ఆవరణంలో చెత్తా ఆస్పత్రి వ్యర్థాలను సకాలంలో తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్ కిరణ్‌కుమార్, ఆర్ఎంవోలు డాక్టర్ కళావతిభాయి, డాక్టర్ రాంబాబు, డాక్టర్ వినాయక్ రాథోడ్, డాక్టర్ రాంప్రసాద్, తదితరులున్నారు.



డంపింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత

వైరా,సెప్టెంబరు26: రాష్ట్రంలోని ఆర్యవైశ్యులకు అండగా ఉంటానని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత పేర్కొన్నారు. వైరాలోని వాసవీ కల్యాణ మండపంలో బుధవారం రాత్రి మిట్టపల్లి రాఘవరావు అధ్యక్షతన తనకు నిర్వహించిన అభినందన, సన్మాన సభలో మాట్లాడారు. రాబోయే రోజుల్లో ఆర్యవైశ్యుల రాజకీయ ప్రవేశం పెరగాలని దానికనుగుణంగా అవకాశాలు సాధించుకుందామని ఆమె తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజ శేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కాంగ్రెస్ నాయకులు కట్ల రంగారావు, మిట్టపల్లి నాగి, శీలం వెంకటనర్సిరెడ్డి,ఏదునూరి సీతరాములు, ఆర్యవైశ్యసంఘం నాయకులు అనుమోలు భాస్కర్‌రావు, గ్రంధి ప్రవీణ్, తాటికొండ రాము, మిట్టపల్లి శ్రీనివాసరావు, పెనుగొండ ఉపేంద్రరావు, రాయల నారాయణరావు, బండారుపల్లి కృష్ణారావు, మరిశెట్టిజనార్ధన్, కొణతం రాజారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాల్వ సుజాత

మాతృసంస్థలోకి హౌసింగ్ ఉద్యోగులు

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు26: 2016లో అప్పటి ప్రభుత్వం గృహనిర్మాణ సంస్థను రద్దు చేసి కార్పోరేషన్‌లో ఉన్న ఉద్యోగులను ఇతర శాఖలకు డిప్యూటేషన్‌పై పంపించింది. ఈనేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించాలన్న లక్ష్యంతో ఇతర శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులను తిరిగి మాతృ సంస్థకు తీసుకు రావాలంటూ జీవో జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో 30మంది ఉద్యోగులు తిరిగి గృహనిర్మాణ సంస్థ పరిధిలోకి రానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తిరిగి గృహనిర్మాణ సంస్థను పునరుద్ధరించి ఉద్యోగులను తిరిగి చేర్చుకోవడం పట్ల వారు ప్రభుత్వానికి, అధికారులకు అభినందనలు తెలిపారు.

వరద బాధితులకు సహాయం

కల్లూరు,సెప్టెంబరు 26: మండల పరిధిలోని లింగాల గ్రామంలో కాంగ్రెస్ నాయకులు మున్నేరు వరద బాధితులకు రూ.60 వేల ఆర్థిక సహాయం అందించారు. గురువారం సతుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌కు 6క్వింటాళ్ల బియ్యం, రూ.25 వేల నగదును అందజేశారు. ఆ గ్రామంలో పలువురు దాతల నుంచి సేకరించిన బియ్యం, నదరు నగదును నేరుగా ప్రత్యేక వాహనం ద్వారా తరలించి సత్తుపల్లి క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, ఏనుగు సత్యంబాబు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, మంగపతిరావు, మద్దినేని లోకేష్‌రావు, మద్దినేని శ్రీనువాసరావు, దేవరపల్లి శ్రీను, తక్కేళ్లపాటి ప్రసాద్ తాళ్లా వెంకటేశ్వరరావు, బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు చెక్కును అందిస్తున్న దాతలు

గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

ఖమ్మం సాంస్కృతికం, సెప్టెంబరు26: గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని అఖిల భారత అయ్యప్ప ధర్మప్రచార సభ జాతీయ ప్రధాన కార్యదర్శి బేతి తిరుమలరావు, తెలంగాణ అధ్యక్షుడు టీవీ పుల్లం రాజు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కాశ్మీర్ నుంచి కన్యా కుమారివరకు బాలకృష్ణ గురుస్వామి చేపట్టిన మహా పాదయాత్రకు మద్దతు తెలపాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరూ పాదయాత్రను బలపరచాలన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ఖమ్మంరూరల్, సెప్టెంబరు26: మండల పరిధిలోని వెంకటగిరిలోని ప్రభుత్వ భూములను పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంకటగిరి గ్రామంలో గురువారం జరిగిన గ్రామ శాఖ సభలో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నండ్రా ప్రసాద్, పి.మోహన్‌రావు సత్యనారాయణ, శ్రీనివాస్‌రావు, రాంబాబు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు దిగొద్దు: రూరల్ ఏసీపీ

నేలకొండపల్లి, సెప్టెంబరు26: ప్రజలు ప్రశాంతంగా ఉండాలని, అనవసరంగా గొడవలకు దిగవద్దని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి కోరారు. మండల పరిధిలోని చెర్వుమాధారంలో జరిగిన సంఘటనపై గురువారం ఏసీపీ ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ గొడవలకు దిగితే అందరినీ బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. చదువు కునే వాళ్ళు, యువకులు ఉన్నారని కేసులు నమోదైతే ఉద్యోగాలకు అనర్హులవుతారన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. సమావేశంలో కూసుమంచి సీఐ సంజీవ్ పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో మరోసారి సర్వే నిర్వహించాలి

మేయర్‌కు సీపీఎం నాయకుల వినతి

ఖమ్మంసంక్షేమవిభాగం, సెప్టెంబరు26: మున్నేరు ముంపు ప్రాంతాల్లో మరోసారి సర్వే నిర్వహించి వరద బాధితులకు ప్రభుత్వం సహాయం అందించాలని సీపీఎం ఖమ్మం త్రీ టౌన్ కమిటీ నాయకులు మేయర్ పునకొల్లు నీరజకు వినతిపత్రం అందించారు. గతంలో సర్వే పూర్తి జరిగిన బాధితుల బ్యాంకు ఖాతాలకు పరిహారం అందలేదని, రెండో సారి సర్వేచేసిన వారి జాబితాలను విడుదల చేయాలని కోరారు. త్రీటౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాస్‌రావు, కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, బండారి యాకయ్య, ఎస్‌కే సైదులు, పీ.సులోచన, చికటిమల్ల శ్రీను, సారంగి పాపారావు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలి

మేయర్, కమిషనర్‌కు నాయకుల వినతి

ఖమ్మంసంక్షేమవిభాగం, సెప్టెంబరు26: ఖమ్మం డంపింగ్ యార్డును తక్షణమే దన్వాయిగూడెం నుంచి ఇతర ప్రాంతాలకు తరలించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మేయర్ పునకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్యను కోరారు. గురువారం డంపింగ్‌యార్డు తరలింపు ఉద్యమ కమిటీ అఖిలపక్షం ఆధ్వర్యంలో మేయర్ పునకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్యలను కలిసి వినతిపత్రాలను అందించారు. స్పందించిన మేయర్ మూడు నెలల్లో సమస్యను పరిరిష్కరిస్తామని చెప్పారు. నాయకులు ఎండీ మౌలాన, జానిమియా, బోడా వీరన్న, పోటు కళావతి, అనుమల సోమయ్య, కనకాల బాబు, వెంకటాచారి, చారి, రాము పాల్గొన్నారు.

కమిషనర్ల బదిలీపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిలో ఎక్కడ?

వైరా,సెప్టెంబరు26: వైరా మునిసిపాలిటీ కమిషనర్ల బదిలీలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై పాలకవర్గానికి లేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు విమర్శించారు. వైరామునిసిపాలిటీ పదోవార్డు గండగల పాడులో గురువారం జరిగిన సీపీఎం గ్రామశాఖల ఎన్నికల సమావేశంలో మాట్లాడారు. మునిసిపాలిటీ ఏర్పడిన ఈ ఆరు సంవత్సరాల కాలంలో ఇప్పటికీ 12 మంది కమిషనర్లు వచ్చి బదిలీ అయ్యారని, మితిమీరిన రాజకీయ జోక్యంతోనే పరిస్థితి వచ్చిందన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, నాయకులు చింతనిప్పు చలపతిరావు, మల్లెంపాటి రామారావు, మచ్చా మణి, గుమ్మా నర్సింహారావు, వాసిరెడ్డి విద్యాసాగర్‌రావు, పల్లెబోయిన కృష్ణ, గుమ్మా సుధీర్ పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరం విజయవంతం

పెనుబల్లి,సెప్టెంబరు26: స్వచ్ఛతాహీ సేవ పక్షోత్సవాల్లో భాగంగా పెనుబల్లి మండలపరిషత్ కార్యాలయంలో మల్టీపర్పస్ ఉద్యో గులకు లంకాసాగర్ పీహెచ్‌సీ వైద్యుడు గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. 17మంది రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణ, తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీవో ఉపేంద్రయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు షేక్.బషీరుద్దీన్, ఎంఎల్‌హెచ్‌పీ కవిత, అలేఖ్య, అశోక్, ఏఎన్ఎం బేగం, కృష్ణకుమారి, రాణి, పంచాయతీ కార్యదర్శి ముస్తఫా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంరూరల్, సెప్టెంబరు26: మండలంలోని గుర్రాల పాడు, వెంకటగిరి, గుదిమళ్ల గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్‌కోత ఉంటుందని ఏఈ క్రాంతి సింహ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

'సేవాసే సీకెన్' కార్యక్రమం ప్రారంభం

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు26: ఖమ్మం ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో సేవాసే సీఖెన్ 2024 అనుభవాత్మక కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్,ఆర్ఎంవో కళావతిబాయి ఆధ్వర్యంలో మేరా యువ భారత్ తరపున జిల్లాఅధికారి భాను హాజరయ్యారు. యువతకు ఆసుపత్రి సేవలపై అవగాహన కల్పిస్తూ వారిలోని సేవాస్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యమన్నారు.

పీఆర్టీయూ కమిటీ ఎన్నిక

వేంసూరు,సెప్టెంబరు26: పీఆర్టీయూ మండల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా చింతా కృష్ణయ్య, గడ్డం రాజశేఖర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా బృందావనం సత్యనారాయణ, కార్యదర్శిగా జమ్ముల రమేష్ బాబు, మహిళా అధ్యక్షురాలిగా పి.రోజారమణిని ఎన్నుకున్నారు. స్థానిక హైస్కూల్లో జరిగిన సమావేశంలో ఎన్నిక జరిగింది. జిల్లాఅధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రంగారావు, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

విషజ్వరాలపై అవగాహన

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు26: విషజ్వరాలపై మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ నగర్‌లో అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ కుమార్‌రాజా గురువారం తెలిపారు. ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న విషజ్వరాలపై తీసుకో వాల్సిన జాగ్రత్తలు, నివారణ మార్గాలను కర పత్రాల ద్వారా ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ఛైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.దాసరి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

జేవీఆర్ కళాశాలలో ఎన్‌సీసీ ప్రవేశాలు

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు26: జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో గురువారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎన్‌సీసీ ప్రవేశాలను కల్పించినట్లు ప్రిన్సిపాల్ ఎన్.గోపీ తెలిపారు. ఖమ్మంలోని 11వ బెటాలియన్ కమాడింగ్ ఆఫీసర్ సంజయ్‌కుమార్ భద్ర ఈ నియామకాల్లో భాగంగా పోటీ పరీక్షలు నిర్వహించారు. ఇక్కడి విద్యార్థులతో పాటు దమ్మపేట ట్రైబల్ డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థులు పాల్గొనగా వారికి దేహదారుడ్య పరీక్షలు, మౌఖిక, రాత పరీక్షల ద్వారా సుమారు 50 మంది కెడెట్లను ఎంపికచేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అడ్మిన్ ఆఫీసర్ నవీన్‌యాదవ్, లలిత్‌సింగ్, కేర్‌టేకర్ కే.రవికుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

వేంసూరు, సెప్టెంబరు 26: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సత్తుపల్లి ఐసీడీఎస్ సీడీపీవో కనకదుర్గ, ఎంపీడీవో రమాదేవి సూచించారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం చంభానిగూడెంలో బీరాపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ భవానీ ఆధ్వర్యంలో పోషకాహార పదార్థాల ప్రదర్శన, గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సఫియా, డాక్టర్ ఇందుప్రియా, ఏఈ సాయికుమార్, హెచ్‌వీ పద్మ, ఏఎన్ఎం కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్లు చంద్ర, పద్మ, రావేలు, కళా, రజిత, షాలిని, నిర్మల, అనంతలక్ష్మీ, మంగా, రత్న, రమ, ఆశ పుల్లమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు26: అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని తీసుకో వాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ గంగాజలం కోరారు. గురువారం మండలంలోని పాకలగూడెం అంగన్‌వాడీ సెంటర్‌లో సీమంతాలు, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కుమారి, యశోద, సకీనా, త్రివేణి, కృష్ణకుమారి, గంగాభవానీ, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

ఏన్కూరు, సెప్టెంబరు26: పీఆర్సీని వెంటనే ప్రకటించాలని ఉద్యోగులకు రావాల్సిన ఐదుపెండింగ్ డీఏలను విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్‌ప్రభుత్వాన్ని డిమాండ్ చశారు. సభ్యత్వ నమోదు లో భాగంగా గురువారం జన్నారం, ఏన్కూరు, తిమ్మారావుపేట, బురదరాఘవాపురం, కేజీబీవీ గురుకుల పాఠశాలలను సందర్శించారు.

శరన్నవరాత్రుల వేడుకలకు సర్వం సిద్ధం

వైరా, సెప్టెంబరు 26: వైరా మునిసిపాలిటీ రెండోవార్డు హనుమాన్ బజార్‌లో ఉన్న శ్రీమహాలక్ష్మమ్మ అమ్మవారి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభించామని నిర్వాహకులు తెలిపారు. వచ్చేనెల మూడునుంచి 12వరకు ఈ ఉత్సవాలు ఆలయ అర్చకులు బొడ్డుపల్లి వాసుదేవశాస్త్రీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ బండారు తిరుపతిరావు తెలిపారు. ఈ ఉత్సవాల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. నిర్వాహకులు ఓర్సు శ్రీను, దుర్గా, వేముల కోటేశ్వరరావు, రాములు, బాలయ్య, ఆంజనేయులు, పల్లపు కొండలు, దేవళ్ల కృష్ణ, నారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

27న పూజా సామగ్రి దుకాణ వేలం

ఏన్కూరు, సెప్టెంబరు26: ఈనెల27న గార్లొడ్డు శ్రీలక్ష్మి నర్సింహా స్వామి దేవస్థానంలో వేలం నిర్వహించ నున్నారు. కొబ్బరికాయలు పూజా సామాన్లు, పాలు బెల్లం, బియ్యం, కొబ్బరి చిప్పలు పోగు చేసుకొనేందుకు శుక్రవారం ఉదయం 11గంటలకు బహిరంగ వేలం పాట వేయనున్నట్లు ఈవోప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

రక్తదాన శిబిరం విజయవంతం

వైరా, సెప్టెంబరు 26 వైరాలోని సోమవారం గ్రామం గ్రీన్‌ఫీల్డ్ క్యాంపు ప్రాంగణంలో గురువారం హెచ్‌జీ ఐఈఎల్ సంస్థ తరుపున రక్తదాన శిబిరం నిర్వహించారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, పార్మాసిస్టులచే పలువురు దాతల నుంచి రక్తం సేకరించారు. సేకరించిన రక్తాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి అందిచనున్నట్లు గ్రీన్‌ఫీల్డ్ అధికారులు తెలిపారు. అనంతరం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఎండి హరింద్రసింగ్ చౌదరి, పీడి చౌదరి, అడ్మినిస్ట్రేటర్ మహేంద్రబాజ్‌పేయి, హెచ్‌ఆర్ కైలాష్‌చంద్ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు మతి స్థిమితం లేని వ్యక్తి

నేలకొండపల్లి, సెప్టెంబరు26: మతి స్థిమితంలేని వ్యక్తిని అన్నం ఫౌండేషన్‌కు తరలించి బాగుచేసి గురువారం అధికారులు, పోలీసుల సమక్షంలో కుటుంబ సభ్యులకు అన్నం శ్రీనివాసరావు అప్పగించారు. కూసుమంచి రోడ్డు లోని హైవే అండర్ బ్రిడ్జి కింద మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న వ్యక్తిని గ్రామస్తులు దాదాపు 6నెలల క్రితం అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. కోలుకున్న అనంతరం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా, కొమరోలు మండలం, వట్టివేపమానిపల్లెని చెప్పటంతో కుటుంబ సభ్యులకు అన్నకు సమాచారం అందించారు. దీంతో నేలకొండపల్లిలో రెవెన్యూ అధికారులు, ఏఎస్ఐ సమక్షంలో నాగేశ్వరరావును కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ఖమ్మంసంక్షేమవిభాగం, సెప్టెంబరు26: గురువారం పలు డివిజన్లలో మేయర్ నీరజ పర్యటించి ఇంటింటికి వెళ్లి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్పొరేటర్లు పల్లెబోయిన భారతిచంద్రం, మాజీ కార్పొరేటర్ పొట్ల వీరేందర్, నాయకులు శెట్టి రంగారావు, ఈదర నరేశ్, యాసిన్, మరికంటి కృష్ణగౌడ, పాలబోయిన వెంకటేశ్వర్లు, వీరన్న పాల్గొన్నారు.

